Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 269 మేడ్చల్ మల్కాజ్‌గిరి 18 అక్టోబర్ 2023 బుధవారం పేజీలు : 4

## ఇజ్రాయెల్‌పై మోదీకి తెగ బాధ

### ప్రధానిపై రాహుల్ విమర్శనాస్త్రాలు.. మిజోరాంలో పాదయాత్ర

ఐజ్వాల్ : ప్రధాని మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. కొన్నాళ్లుగా తీవ్ర ఉద్రిక్తతలతో రగులుతు న్న మణిపూర్ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోని ప్రధాని.. ఇప్పుడు ఎక్కడో ఉన్న ఇజ్రాయెల్‌లో జరగుతున్న పరిణామాలపై తెగ బాధపడుతున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ ఏడాది మే నుంచి మణిపూర్‌లో దారుణాలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఈశాన్య రాష్ట్రం మిజోరాంలో రెండు రోజుల పాటు రాహుల్ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మిజోరాం రాజధాని ఐజ్వాల్‌లో పాదయాత్రను చేపట్టారు. మిజోరాం పొరుగు రాష్ట్రమైన మణిపూర్ ఇప్పుడు జాతుల ప్రాతిపదికన రెండుగా విడిపోయిందన్నారు.

# కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు ఊడగొట్టాలి

## నిరుద్యోగ యువకులారా కదలిరండి...!

# మీ సత్తా చూపండి




## పిలుపునిచ్చిన టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: సీఎం కేసీఆర్, మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ పదే పదే కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నారని, డబ్బులు, మందు పంచి ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్ చూస్తోందని ఆరోపిస్తున్నారని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. వారి ఆరోపణలు చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో డబ్బు, లిక్కర్ పంచి ఎన్నికల్లో గెలవాలని చూశారని, బీజేపీ, బీఆర్ఎస్ పోటీ పడి ఉప ఎన్నికల్లో వందల కోట్లు ఖర్చు చేశాయని రేవంత్ ఆరోపించారు. నెలరోజుల్లో రూ. 60 కోట్ల మద్యం అమ్మకాలు జరిగితే... మునుగోడు ఉప ఎన్నిక జరిగిన 30 రోజుల్లో రూ. 300 కోట్ల మద్యం అమ్మార న్నారు. మునుగోడులో కాంగ్రెస్ చుక్క మందు, డబ్బు పంచలేదని స్పష్టం చేశారు. దేశంలోనే హుజూరాబాద్ అత్యంత ఖరీదైన ఎన్నికలని ఆనాడు విశ్లేషకులు చెప్పారన్నారు. మునుగొడు ఉప ఎన్నికల్లో అంతకంటే ఎక్కువ ధన ప్రవాహం జరిగిందన్నారు. అందుకే తమపై ఆరోపణలు చేస్తున్న కేసీఆర్‌కు సూటిగా సవాల్ విసిరానని, చుక్క మందు, డబ్బు పంచకుండా ఎన్నికలు నిర్వహించాలని సవాల్ విసిరానని రేవంత్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతోనే ఎన్నికలకు వెళుతోందని, అమరవీరుల స్థూపం దగ్గరకు వచ్చి ప్రమాణం చేద్దామని ఆహ్వానించానని, సీఎం కేసీఆర్ రాకపోగా... స్థూపం వద్దకు వెళితే తనను పోలీసులు అరెస్టు చేస్తారా? అంటూ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ముందస్తు అనుమతి పేరుతో పోలీసులు నిర్బంధించారని, కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు చేశారన్నారు. తెలంగాణ ప్రజలు కోరింది స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి అని, నీళ్లు, నిధులు, నియామకాలను కేసీఆర్ తన కుటుంబానికే పరిమితం చేశారని ఆరోపించారు. తాను విసిరిన సవాల్‌ను స్వీకరించకపోవడంతో... సీఎం కేసీఆర్ ఎన్నికల్లో డబ్బు, మద్యాన్ని నమ్ముకున్నారని స్పష్టత వచ్చిందన్నారు. నిరుద్యోగ యువతి ప్రవళిక ఆత్మహత్య చేసుకుంటే... ఆ కుటుంబం పరువును మంటగ లిపేలా ప్రభుత్వం వ్యవహరించిందని, ప్రేమ విఫలమై చనిపోయిందని పోలీసు అధికారి ఎలా చెబుతారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. నిర్భయ చట్టాన్ని ఉల్లంఘించి వివరాలు ఎలా బయటపెడతారు?.. కోర్టు అనుమతితో ఆధారాలు తీసుకున్నాకే వివరాలు వెల్లడించాలని.. కానీ అవేవీ చేయలేదన్నారు. తాను ప్రశ్నిస్తే... ప్రెస్ మీట్ పెట్టిన అధికారిని కాకుండా వేరే అధికారిని సస్పెండ్ చేశారన్నారు. రిటైర్ అయిన అధికారులను ప్రభుత్వం ఎందుకు కొనసాగిస్తోందని నిలదీశారు. వారిని ప్రయివేట్ సైన్యంగా చేసుకుని కేసీఆర్ తమపై దాడులు చేయిస్తున్నారన్నారు. నిన్న గన్ పార్క్ వద్ద నిరసనలు చేసినవారికి నిబంధనలు వర్తించవా?.. కాంగ్రెస్‌ను తిట్టి ధర్నా చేసే వారికి రిటర్నింగ్ అధికారి అనుమతి అవసరం లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో అన్నింటినీ రెట్టింపు చేసి సీఎం కేసీఆర్ మేనిఫెస్టోలో పెట్టారని రేవంత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పామని.. మరి ముఖ్యమంత్రి ఉద్యోగ నియామకాల ఊసే ఎత్తలేదన్నారు.

ప్రవళిక కుటుంబ సభ్యులను రేపు రాహుల్ గాంధీ వద్దకు తీసుకెళ్లాలనుకుంటే... బీఆర్ఎస్ నేతలను పంపి ఆ కుటుంబాన్ని ప్రగతి భవన్‌లో బంధిస్తారట... సీఎం ఇంతటి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. "నిరుద్యోగ యువకులారా మీ శక్తిని తక్కువ అంచనా వేయకండి... 30 లక్షల నిరుద్యోగ యువకులారా... ఇక్కడి నుంచి పిలుపునిస్తున్నా.. ఈ 45 రోజులు ప్రతీ నిరుద్యోగ యువకుడు ముందుకొచ్చి కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలను ఊడగొట్టాలి... కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జాబ్ క్యాలండర్ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపడుతుంది... ఏడాదిలోగా 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం.. మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది.. ఒక ఆడబిడ్డ కుటుంబాన్ని అవమానించేలా వ్యవహరించిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి" అని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## బీజేపీని నష్ట పరిచేందుకు ఆ ముగ్గురు కుట్ర చేస్తున్నారు

నిజామాబాద్: బీజేపీ పార్టీని నష్ట పరిచేందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత కుట్ర చేస్తున్నారని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నాడు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ ఎంపీ అర్వింద్



హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్వింద్ మీడియాతో మాట్లాడుతూ.."మున్నూరు కాపులు, మైనార్టీలు ఆకుల లలితను నమ్మొద్దు. గతంలోనూ ఆకుల లలిత, డీఎస్‌ను మోసం చేసి ఎమ్మెల్సీ పదవి తెచ్చుకుంది. ప్రస్తుతం డీఎస్ కొడుకు సంజయ్‌ను మోసం చేయాలని చూస్తోంది. ఎమ్మెల్సీ కవిత, రేవంత్‌రెడ్డి వ్యాపార భాగస్వామిలు. ఆకుల లలితను కవిత కావాలని కాంగ్రెస్ పార్టీలోకి పంపి టికెట్ ఇప్పిస్తున్నారు" అని ఎంపీ అర్వింద్ ధ్వజమెత్తారు.

## సిద్దిపేట స్ఫూర్తితోనే ముందుకు సాగుతున్నా: సీఎం కేసీఆర్

సిద్దిపేట: సిద్దిపేట పేరు వింటే స్వర్గం కంటే నా జన్మభూమి గొప్పది అనే భావన కలుగుతుందని సీఎం కేసీఆర్ అన్నారు. సిద్దిపేటలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడారు. "ఈ సిద్దిపేట గడ్డ నన్ను సాధింది.. పెద్దది చేసింది. చదువు చెప్పింది. రాజకీయంగా నాకు జన్మనిచ్చింది. నాయకుడిని చేసింది. తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యేంత ఎత్తుకు తీసుకెళ్లింది నా గడ్డ.. సిద్దిపేట. ఇవాళ దేశం మొత్తం ఆశ్చర్యపోయేలా తెలంగాణ అన్ని రంగాల్లో దూసుకెళ్తోంది. రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లగలుగుతున్నానంటే ఈ గడ్డ నుంచి నాకు అందిన బలమే కారణం. నన్ను ఇంతవాడనికి చేసిన మీ అందరికీ నా నమస్కారాలు. ప్రతి సందర్భంలో నన్ను విజేతగా నిలబెట్టిన ఈ గడ్డ రుణం ఎన్నటికీ తీర్చుకోలేను. నేను అభిమానంతో పేర్లు పెట్టి పిలిచే గడ్డ ఈ సిద్దిపేట గడ్డ. ఒకప్పుడు బంగారం లాంటి భూములున్నా పంటల పండించుకోలేకపోయాం. సిద్దిపేటలో మంచినీళ్ల కరవు వస్తే ట్యాంకర్లతో నీళ్లు తెప్పించాం. ఇలాంటి పరిస్థితుల్లో వంద బోర్లు వస్తే ఒక్కటీ పడలేదు. ఆనాడే లోయర్ మానేరు డ్యామ్ నుంచి నీరు తెచ్చి జలజాతర చేసుకున్నాం. ఇవాళ మిషన్ భగీరథ తెలంగాణ మొత్తం అమలవుతుందంటే సిద్దిపేట మంచినీళ్ల పథకమే దానికి పునాది" అని సీఎం కేసీఆర్ అన్నారు.

**ఆరు అడుగుల బుల్లెట్ హరీశ్..: సీఎం కేసీఆర్ –** "తెలంగాణ తల్లిని విముక్తి చేస్తే తప్ప ఈ గడ్డకు న్యాయం జరగదని భావించి ధైర్యంగా ముందడుగు వేశా. ప్రాణాలకు తెగించి తెలంగాణ ఉద్యమం



ప్రారంభించాం. తెలంగాణ ఉద్యమం విజయం సాధించడానికి పునాది వేసింది కూడా ఈ సిద్దిపేట గడ్డమీదే. సిద్దిపేటలో జరిగిన అభివృద్ధి మీకు తెలుసు. నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. నేను కరీంనగర్ ఎంపీగా ఎన్నికయ్యా. తెలంగాణ కోసం దిల్లీలో పనిచేయాలి. రాష్ట్రాన్ని విడిచిపెట్టి వెళ్లాలి. కరీంనగర్‌లో ఒక మీటింగ్ పెట్టుకున్నాం. అందరం ఒక పది నిమిషాల పాటు ఏడ్చేశాం. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికలో .. ఆరు అడుగుల బుల్లెట్ హరీశ్‌ను మీకు అప్పగించా. బ్రహ్మాండంగా నేను ఊహించిన దానికన్నా ఎన్నో రేట్లు మెరుగ్గా పనిచేసి నా మాట నిలబెట్టాడు. హరీశ్‌రావు మీద ఒక జోకు ఉంది.. 'హరీశ్‌రావు ఈడ తిరుగుతడు.. ఆడ తిరుగుతడు.. ఏడన్నా తట్టెడు పెండ కనబడితే తీసుకెళ్లి సిద్దిపేటలో వేసుకుంటడు" అని అంటారు. అంటే తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం, పథకం అన్నింటినీ సిద్దిపేటకు తీసుకురావడంలో ఎంతో కృషి చేశాడు. హరీశ్ స్థానంలో నేనున్నా ఇంతలా చేసేవాడిని కాదేమో. అంత అద్భుతంగా పనిచేస్తున్నాడు. తెలంగాణ రాష్ట్రంలో సిద్దిపేటకు ఒక ప్రత్యేకత.. గౌరవం ఉంది. గత ఎన్నికలతో పోల్చితే ఈ సారి భారీ మెజారిటీతో హరీశ్‌ను గెలిపించాలి" అని సీఎం కేసీఆర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

**సిద్దిపేటను సస్యశ్యామలం చేసుకున్నాం: హరీశ్‌రావు –** సిద్దిపేట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రజా ఆశీర్వాద సభలో హరీశ్ మాట్లాడుతూ.. "దశాబ్దం క్రితం రాష్ట్రంలో కరవు తాండవించింది. ప్రస్తుతం తెలంగాణ 10 రాష్ట్రాలకు అన్నం పెడుతోంది. బుల్లెట్ వేగంతో సిద్దిపేటకు రైలు మార్గాన్ని పూర్తి చేశాం.

ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేసినప్పుడు నేను నీళ్ల మంత్రిగా ఉన్నా. కాళేశ్వరం నుంచి నీళ్లు వ స్తాయా? మేం బతికి ఉండగా చూస్తామా? అని ఇక్కడి ప్రతిపక్ష నేత లు వెటకారంగా మాట్లాడారు. కేవలం మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసుకున్నాం. సిద్దిపేటను సస్యశ్యామలం చేసుకున్నాం. సీఎం కేసీఆర్ రైతుల్లో ధైర్యాన్ని పెంచారు. చాలా మంది కాంగ్రెసోళ్లు ఈ మధ్య ఒక్క ఛాన్స్ ఇవ్వండి అని అడుగుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారి కాదు.. 11 సార్లు అవకాశం ఇచ్చారు. కనీసం తాగడానికి నీళ్లు ఇవ్వని పార్టీ కాంగ్రెస్" అని హరీశ్‌రావు విమర్శించారు.




# కాంగ్రెస్‌తో అప్రమత్తంగా ఉండాలె

## అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారమే!

## సిరిసిల్ల ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

రాజన్న సిరిసిల్ల : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పెద్ద ప్రమాదం పొంచి ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. ఆ పార్టీ తన భుజం మీద గొడ్డలి పెట్టుకుని రెడీగా ఉందని, రైతులకు మళ్లీ కష్టాలు తీసుకొస్తదని కేసీఆర్ అన్నారు.

రాజన్న సిరిసిల్ల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఇవాళ ఎక్కడా చూసినా పచ్చటి పంట పొలాలతో ఒక బెత్తడి జాగా ఖాళీ లేకుండా వరి నాట్లు కనడబుతున్నాయని కేసీఆర్ తెలిపారు. ఇది చాలా సంతోషం. మూడు కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించే నా తెలంగాణ బిడ్డలు.. సన్నబియ్యం తినాలనే ఉద్దేశంతో, వచ్చే ప్రభుత్వంలో సన్నబియ్యం ఇవ్వాలని మేనిఫెస్టోలో పెట్టుకున్నామని కేసీఆర్ తెలిపారు. అబద్ధాలు, మోసపు మాటలతో, ఆపద మొక్కులు మొక్కుతూ వచ్చే వారుంటారు.. వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని కేసీఆర్ సూచించారు. కేటీ రామారావు గుణమేందో. గణమేందో మీకే ఎక్కువ తెలుసు. ఇక్కడ రావాల్సినవి వచ్చాయి. గొప్ప విద్యాకేంద్రంగా తీర్చిదిద్దుతాం. నీళ్లు పుష్కలంగా వచ్చాయి. అన్ని హంగులు సిరిసిల్ల ప్రాంతానికి ఏర్పడే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఆపద మొక్కులు మొక్కే వారు చాలా మంది వస్తుంటారు. ఒక పెద్ద ప్రమాదం పొంచి ఉన్నది. రైతు సోదరులను హెచ్చరిస్తున్నా. మూడు సంవత్సరాలు రాత్రింబవళ్లు కష్టపడి ధరణి పోర్టల్ తీసుకొచ్చాం. రైతుల భూములు క్షేమంగా ఉండాలి. కౌలుకు ఇచ్చినంత మాత్రాన ఇంకోకరి పరం కావొద్దు అని ధరణిని తీసుకొచ్చాం. రిజిస్ట్రేషన్లు పావుగంటలో అయిపోతున్నాయి. ధరణి వల్ల 98 శాతం మంది రైతులకు మేలు జరిగింది. కాంగ్రెస్ పార్టీ భుజం మీద గొడ్డలి పెట్టుకుని రెడీగా ఉ ంది. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ కూడా ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ధరణిని తీసి బంగాళాఖాతంలో విసిరేస్తారట. మళ్లీ వీఆర్‌వోలు, గిర్దావర్‌లు వాని భూమి వీనికి రాసి, వాని భూమి ఇంకోకరికి రాసి, మళ్లీ రైతులను కోర్టుల చుట్టు తిప్పే పరిస్థితి వస్తుంది. మీ మీద వీఆర్వో, గిర్దారవ్, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్, రెవెన్యూ సెక్రటరీ, సీసీఎల్ఏ, రెవెన్యూ మంత్రి ఉండేవారు. వీరిలో ఒకరికి కోపమొచ్చినా రైతు భూమి ఆగమయ్యేది. కానీ ఇవాళ ఆ అధికారం తీసేసి రైతులకే అధికారం ఇచ్చాం. మీ బొటన వేలి ప్రమేయం లేకుండా.. భూమి ఇతరులకు పోయే అవకాశం లేదు. మీ భూమి హక్కులు మీ బొటనవేలితోనే మారుతాయి. ఈ సిగ్గుమాలిన కాంగ్రెస్ మాటలు నమ్మకండి.. ఇవాళ ధరణి పుణ్యం వల్ల పల్లెలు ప్రశాంతంగా ఉన్నాయి.

ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్న ప్రమాదం వచ్చి నెత్తిన పడుతది. మళ్లీ కథ మొదటికి వస్తది.. చాలా అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాను. అనేక రంగాల్లో.. మనం నంబర్‌వన్‌గా ఉన్నాం అని కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

# సంపాదకీయం

## ఐటీ బతుకు బెంబేలు

### ఉద్యోగుల్లో కోత.. కొత్తవాటికి వాత!

ఐటీ ఉద్యోగం అంటే వైట్ కాలర్ జాబ్. చేతి నిండా డబ్బులు.. వారానికి ఐదు రోజులు మాత్రమే పని. పైగా విస్తృతమైన అవకాశా లు ఉన్న రంగం కూడా. దీంతో బీటెక్, ఎంటెక్ చేసిన వారంతా.. ఐటీ దిశగా అడుగులు వేయడం పరిపాటిగా మారిపోయింది. టెక్ సంస్థల్లో ఉద్యోగం వస్తే.. జీవితమే మారిపోతుందనే మాట కూడా నిజమే. అయితే.. ఇది ఒకప్పటి మాట. కరోనా అనంతర పరిణామాలు కావొచ్చు. ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న సంఘర్షణలు, వివాదాలు.. ఆర్థిక మాద్యం, ద్రవ్యోల్బణం వంటి కారణాలు కావొచ్చు.. ఏదేమైనా..ఇప్పుడు ఐటీ రంగం చివురుటాకు మాదిరిగా వణుకుతోంది. కొత్త ఉద్యోగాల కల్పనలో, భారీ వేతనాలు ఇవ్వడంలో ఒకప్పుడు ముందున్న ప్రఖ్యాత ఐటీ సంస్థలు.. ఇప్పుడు సంక్షోభంలో కూరుకుపోయాయి. టీసీఎస్, హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలు కూడా ఇప్పుడు ప్రమాదపు టంచుల్లోకి వెళ్లిపోయాయి. ఉన్న ఉద్యోగుల్లో కోత పెట్టడంతోపాటు.. కొత్త నియామకాల ఊసే ఎత్తడం లేదు. దీంతో ఐటీ బతుకు బెంబేలెత్తుతున్న పరిస్థితి కనిపిస్తోంది. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్ సంస్థలు తాజాగా ప్రకటించిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాల్లో ఎలాంటి వృద్ధినీ కనబరచకపోగా.. ఆందోళనకర పరిస్థితిలో ఉన్నట్టు స్పష్టంగా తెలిసిపోయింది. ఆయా సంస్థల లాభాలు, ఆదాయాలు బాగానే ఉన్నప్పటికీ.. ఉద్యోగుల(హెడ్ కౌంట్) సంఖ్య విషయంలో మాత్రం గణనీయంగా ఆయా సంస్థలు తమ అంచనాలను తగ్గంచేయడం ఆందోళన కలిగిస్తోంది. అదేసమయంలో కొత్త ఉద్యోగాల కల్పన ఊసే లేకుండా పోవడంతో టెకీలుగా మారాలని కలలు గంటున్న వందల మందికి మరింత ఆందోళన కలిగిస్తోంది. సంస్థల వారీగా చూసుకున్నా.. పరిస్థితి ఇలానే ఉండడం గమనార్హం. ఈ పరిస్థితిని గమనిస్తున్న వారు.. ఐటీ వైపు చూడకపోవడమే మంచిదని.. ఇతర ఉపాధి మార్గాలను ఎంచుకోవడమే బెటర్ అని చెబుతున్నారు.

**ఏ సంస్థ ఎలా ఉంది?** : టీసీఎస్ మూడు మాసాల పనితీరు ఆధారంగా వేల సంఖ్యలో ఉద్యోగులను ఇంటికి పంపించింది. ఈ సంఖ్య 6,333గా ఉంది. టీసీఎస్‌లో ఏప్రిల్ – జూన్ వరకు 6,15,318 మంది ఉద్యోగులు ఉండగా, జూలై–సెప్టెంబరు నాటికి ఈ సంఖ్య 6,08,985కు తగ్గింది. అంటే.. మొత్తంగా 6,333 మంది ఉద్యోగులను తొలగించారు. ఇన్ఫోసిస్‌లోనూ ఉద్యోగుల కోత భారీగా ఉంది. 7530 మంది ఉద్యోగులను ఈ సంస్థ ఇంటికి పంపించింది. పైగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్లను చేపట్టేది లేదని ఇన్ఫోసిస్ ప్రకటించడం గమనార్హం. హెచ్‌సీఎల్ టెక్ సంస్థలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మొత్తంగా ఆరు మాసాల వ్యవధిలో 4800 మంది ఉద్యోగులను ఇంటికి పంపించేసింది. అయితే.. కొత్తగా ఉద్యోగులను నియమించుకుంటామని మాత్రమే ప్రకటించింది.

## ఓటర్ల తొలగింపుపై పునః పరిశీలన



ఖమ్మం : ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించిన వారి వివరాలు పునః పరిశీలించి, నిర్ధారించుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితాలో పీఎస్ఈ నమోదు ధ్రువీకరణ, ఓటరు గుర్తింపు కార్డుల జారీ, బీఎల్వోల నియామకం తదితర అంశాలపై సమీక్షించారు. ప్రైవేట్ వ్యక్తులను బీఎల్వోలుగా నియమించొద్దని, అలాంటి వారుంటే వారంరోజుల్లో తొలగించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.. ఫొటో సిమిలర్ ఎంట్రీలను ఆర్డీవోలు, తహసీల్దార్లు ప్రత్యేకంగా పరిశీలించాలన్నారు. అర్హులకు ఓటుహక్కు కల్పించాలని చెప్పారు. అదనపు కలెక్టర్ మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, సూర్యనారాయణ, దశరథం, ఎన్నికల డీటీ రాంబాబు పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు

జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

గొర్రెల పెంపకందారుల సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్స్, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశమ య్యారు. లబ్ధిదారులకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ ఖాతా పాస్ పుస్తకం జిరాక్స్ పత్రం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, దరఖాస్తుకు జత చేసి పశుసంవర్ధక శాఖ అధికారికి అందించా లని సూచించారు. అదనపు కలెక్టర్ స్నేహలత, శిక్షణ కలెక్టర్ రాధిక గుప్తా, పశుసంవర్ధక శాఖ జేడీ వేణుమనోహర్, ఏడీలు భాను చౌదరి, రమణి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లా నుంచి బస్సుల్లో జనాలను తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 30 బస్సుల్లో ప్రతినిధులను హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

## పనుల ప్రారంభమెప్పుడో?

మహబూబాబాద్ : జిల్లాలోని పలు ప్రాంతాల్లోని లోలెవల్ కాజ్‌వేలు వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. భారీ వర్షాలు పడితే రోజుల తరబడి గ్రామాలకు సంబంధాలు తెగిపోతున్నాయి. అత్యవసర సమయంలో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. దీంతో లోలెవల్ కాజ్‌వేల ఎత్తు పెంపుదలకు ఆర్అండ్‌బీ శాఖ రూ. కోట్ల నిధులను కేటాయించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. గుత్తేదారులు కొన్ని చోట్ల పనులు మొదలు పెట్టలేదు. ఈ వేసవిలోనే పూర్తి చేసి వర్షాకాలంలో వచ్చే వరద కష్టాలకు చెక్ పెడితేనే ప్రజల ఇబ్బందులు తొలగనున్నాయి.

పూర్తైన టెండర్లు

గత వర్షాకాలంలో పలు గ్రామాల్లో భారీ వర్షాలతో రోడ్లు దాటనివ్వని లోలెవల్ వంతెనలున్నాయి. అధికారుల బృందం ఆ ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. వాటి ఎత్తు పెంచడానికి అవసరమైన ప్రతిపాదనలను సర్కారుకు పంపించింది. నిధులు రాగా టెండర్లు కూడా పూర్తయ్యాయి. సీరోలు మండలం చింతపల్లి నుంచి సీరోలు వెళ్లే రహదారిలోని లోలెవల్ వంతెనను పునరుద్ధరించడానికి రూ. 2 కోట్లు, మహబూబాబాద్ మండలం జ్యగిలిగొండ నుంచి రామన్నగూడెం వెళ్లే దారిలోని కాజ్‌వేకు రూ.2 కోట్లు, మరిపెడ మండలం గిరిపురం నుంచి రాంపురం వెళ్లే దారిలోని వంతెనకు రూ.2 కోట్లు, ఇలా జిల్లాలో మరిన్ని లోలెవల్ కాజ్‌వేల కోసం కోట్ల రూపాయలను కేటాయించి టెండరు ప్రక్రియను పూర్తి చేసినా పనులు ఇప్పట్లో ప్రారంభమయ్యేలా లేవు.లోలెవల్ వంతెన పునరుద్ధరణ కోసం సిమెంట్ పైపులు సిద్ధంగా ఉన్న ఈ రహదారి కొత్తగూడ నుంచి పాకాల మీదుగా నర్సంపేటకు వెళ్లేది. ఈ ప్రాంతంలో రెండు కాజ్‌వేలున్నాయి. వాటిని పునరుద్ధరించి వరద కష్టాలు తొలగించడానికి రూ. 2 కోట్ల చొప్పున నిధులు కేటాయించారు. టెండరు పూర్తి చేసి గుత్తేదారుకు పనులు అప్పగించినా



అనుమతులు లేవంటూ అటవీశాఖ అడ్డుకుందని ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు మాత్రం పనులకు అనుమతులు ఇచ్చామని చెబుతున్నారు. రెండు శాఖల అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేసి రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు ఈ లోలెవల్ వంతెన పెద్దవంగర క్రాస్ రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లే దారిలోనిది. పెద్ద చెరువు మత్తడి పోస్తే నీరు పైనుంచి వెళ్తాయి. దీనిని అభివృద్ధి చేసేందుకు చేసేందుకు రూ.2.50 కోట్ల నిధులను కేటాయించారు. ఇప్పట్లో ఆ పనుల్ని మొదలు పెట్టేలా కనిపించడం లేదు. వర్షాకాలం రాకముందే కాజ్‌వే పనుల్ని పూర్తి చేస్తే బాగుంటుందని ఆ ప్రాంత ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గార్ల మండలం రాంపురం, మద్దివంచ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికి పాకాల వాగుపైన ఉన్న వంతెన మీదుగా వస్తారు. వర్షాకాలంలో భారీ వరదతో వాగు ఉప్పొంగితే ఆ రెండు గ్రామాలకు రాకపోకలు సుమారు నెల రోజుల పాటు నిలిచిపోతాయి. దీంతో ప్రజలు, విద్యార్థులు బయ్యారం మీదుగా 20 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తున్నారు. రాంపురం ప్రజలు రైల్వే బ్రిడ్జిపై ప్రాణాలను అరిచేతులో పెట్టుకొని రాకపోకలను కొనసాగిస్తున్నారు. ఈ వంతెన ఎత్తు పెంచేందుకు అధికారులు సుమారు రూ.12 కోట్ల నిధులు కావాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనల అంచనాలను పంపించినట్లు తెలిసింది. ఇంకా సర్కారు నుంచి ఎలాంటి అనుమతి రాలేదు.

త్వరలోనే పనుల్ని ప్రారంభిస్తాం– తానేశ్వర్, ఆర్అండ్‌బీ ఈఈ, మహబూబాబాద్

లోలెవల్ వంతెనల అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తయ్యాయి. వీ త్వరలోనే పనుల్ని ప్రారంభించేలా చొరవ చూపిస్తాం. వర్షాకాలం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తాం.

## రవాణా భత్యం.. అందనంత దూరం



ఖమ్మం : దూరప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సర్కారు రవాణా భత్యం అందిస్తోంది. గత రెండేళ్లుగా భత్యాన్ని మంజూరు చేయడం లేదు. దీంతో పేద విద్యార్థుల కుటుంబాలకు రవాణా ఛార్జీలు భారమవుతున్నాయి. భత్యం కోసం విద్యార్థుల గుర్తింపు, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ జాప్యం అవుతుండటంతో నిధుల విడుదల ఆలస్యమవుతోంది.జిల్లాలో 2021–22 విద్యా సంవత్సరంలో 1,125, 2022–23లో 1,731 మంది విద్యార్థులు భత్యం తీసుకునేందుకు అర్హులని గుర్తించారు. వీరికి మొత్తం రూ.1.45 కోట్లు మంజూరు కావాల్సి ఉంది. సకాలంలో అందిస్తే పిల్లలకు రవాణా కష్టాలు తప్పుతాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసినా నిధులు విడిల్చలేదు. ప్రాథమిక పాఠశాలలైతే కిలోమీటరు దూరం, ప్రాథమికోన్నత అయితే 3 కి.మీ. ఆపైన, ఉన్నత పాఠశాల వారైతే 5 కిలోమీటర్లు, ఆపై దూరం నుంచి వచ్చేవారు భత్యం పొందేందుకు అర్హులు. వీరి హాజరు శాతం నెలవారీగా కనీసం 75 శాతం నమోదవుతూ ఉండాలి. ఒక్కొక్కరికి నెల వారీగా రూ.600 చెల్లిస్తారు. ఇప్పటికే విద్యార్థుల జాబితాను విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపినట్లు జిల్లా అధికారులు పేర్కొంటున్నారు.

12 కి.మీ. దూరం నుంచి వస్తున్నా..

నా పేరు బూడగం భూమిక. పాల్వంచ కేటీపీఎస్ బాలికోన్నత పాఠశాల 9వ తరగతి చదువుతున్నా. కిన్నెరసాని నుంచి రోజూ 12 కి.మీ. ప్రయాణించి హాజరవుతున్నా. మా నాన్న పవన్‌కుమార్ పాల వ్యాపారి. రోజూ నా ఆటో ఛార్జీకి రూ.30 చెల్లిస్తున్నారు. భత్యం కోసం రెండేళ్లుగా ఎదురుచూస్తున్నా.

నెలకు ఆటోకు రూ.2 వేలు చెల్లిస్తున్నా..

నా పేరు బాదావత్ ఆదిత్య. నేను పాల్వంచ బొల్లోరిగూడెం జడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నా. పూసలతండా నుంచి రోజూ 9 కి.మీ. దూరం చెల్లితో కలిసి ఆటోలో వచ్చి వెళ్తున్నా. ఇద్దరికి నెలకు రూ.2 వేలు ఆటో ఛార్జీ చెల్లిస్తున్నాం. భత్యం చెల్లిస్తే ఊరటగా ఉంటుంది.“నిధుల మంజూరు కోరుతూ ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. హాజరు ఆధారంగా అర్హులను గుర్తించాం. నిధులు మంజూరవగానే నేరుగా విద్యార్థుల ఖాతాలో జమచేస్తాం.” ఏఎస్ఓ సతీశ్‌కుమార్

## అందరి బాగుకు ఏకాంత దీక్ష



ఖమ్మం : అందరూ బాగుండాలి.. అందులో నేనుండాలి.. అనే బృహత్తర లక్ష్యంతో రంజాన్ పర్వదినాల్లో ముస్లింలు పది రోజులపాటు ప్రత్యేక దీక్ష తీసుకుంటారు.. అదే ‘ఎత్తేకాఫ్’ ఏకాంత దీక్ష. రంజాన్ మాసంలో 21వ తేదీ నుంచి నెల పొడుపు కనిపించే వరకు 10 రోజులపాటు ఈ దీక్షను చేపడతారు..

దీక్ష ఎలా నిర్వహిస్తారంటే..

దీక్ష చేపట్టాలనే సంకల్పం కలిగిన వారు పురుషులైతే.. తాము నిత్యం నమాజు ఆచరించే మసీదులో దీక్ష తీసుకుంటారు. మసీదులో ఒక ప్రదేశాన్ని ఎంచుకొని ప్రత్యేకంగా నలువైపులా పరదాలు ఏర్పాటు చేసుకుంటారు. అందులోనే 10 రోజులపాటు దీక్ష చేపడతారు. మహిళలు తమ నివాసాల్లోనే ఒక గదిని ఎంచుకొని లేదా, గదిలో ఓ ప్రదేశాన్ని ఎంచుకొని ప్రత్యేకంగా పరదాలు ఏర్పాటు చేసుకొని దీక్ష చేస్తారు. పరదాల మాటునే ఏకాంతంగా గడుపుతారు. కేవలం కాలకృత్యాలు తీర్చుకునేందుకు మాత్రమే పరదాల నుంచి బయటకు వస్తారు.

గ్రామంలో కనీసం ఒక్కరైనా..

కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను, ఇతర వ్యాపకాలన్నింటినీ వదిలేసి 10 రోజులపాటు ఏకాంతంగా గడుపుతూ ఎంతో కఠినత్వాన్ని ఎదుర్కొంటూ చేపట్టే ఈ దీక్షను కుటుంబంలో ఒక్కరైనా, కనీసం వీధిలో నుంచి ఒక్కరైనా.. లేదా గ్రామం నుంచి ఒక్కరైనా చేపట్టాలంటూ ఇస్లాం సూచిస్తుంది. గ్రామం నుంచి ఒక్కరైనా దీక్ష చేపడితే.. గ్రామంపై అల్లా చల్లని చూపు ప్రసాదిస్తారని విశ్వాసుల నమ్మిక. ఈ మేరకు, పవిత్ర రంజాన్ మాసం కొనసాగుతున్న నేపథ్యంలో బుధవారం నుంచి ఏకాంత ఎత్తేకాఫ్ దీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని అనేక మసీదుల్లో, నివాసాల్లో ముస్లింలు సాయంత్రం 5 గంటల తర్వాత దీక్షలను ప్రారంభించారు.

ఈ దీక్షలు రంజాన్ మాసం ముగిసే వరకు కొనసాగిస్తారు.

ప్రార్థనలు

దీక్షపరులు ఎవ్వరితోనూ మాట్లాడకుండా, చరవాణి లాంటి వాటికి దూరంగా, బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా రేయింబవళ్లు అదే పరదాల మాటున గడుపుతారు. ప్రతిరోజు ఉపవాసాన్ని కొనసాగిస్తూ.. వేళ ప్రకారం కుటుంబ సభ్యులు సమకూర్చిన ఆహారాన్ని భుజిస్తుంటారు. నిత్యం దివ్య ఖురాన్ పఠిస్తూ.. మహ్మద్ ప్రవక్త జీవన విధానాన్ని తెలిపే హదీసు పుస్తకాన్ని చదువుతూ.. అల్లాను స్మరిస్తూ.. నిత్యం ఆచరించే ఐదు వేళల నమాజుతోపాటు ప్రత్యేకత కలిగిన పలు నమాజులను ఆచరిస్తూ గడుపుతారు. లోకకల్యాణం కోసం ప్రత్యేక దువా(వేడుకోలు) చేస్తుంటారు. ఆపదల నుంచి జనాన్ని రక్షించాలని, సమాజంలో ప్రతి ఒక్కరూ గౌరవప్రదమైన జీవనాన్ని గడిపే విధానాన్ని ప్రసాదించమని, వర్షాలతో, పాడి పశువులతో వ్యవసాయ కుటుంబాలు వర్ధిల్లేలా చల్లగా చూడాలని, ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి సమాజాన్ని రక్షించంటూ దువా చేస్తారు.

## వైకుంఠధామం.. మధ్యలో క్రీడా మైదానం..!

మహబూబాబాద్: మండలంలోని రాజుతండా, బీఆర్ఎన్ తండాకు చెందిన క్రీడామైదానాలు, కంపోస్టు షెడ్డులు, వైకుంఠధామాలను పుల్లూరులోని ఒకే ప్రదేశంలో ఏర్పాటు చేయించడం పలువురికి విస్మయం కలిగిస్తోంది. వైకుంఠధామం పక్కనే క్రీడా మైదానం నెలకొల్పి చదను చేయించలేదు. పుల్లూరు గ్రామంలో ఉన్న రాజుతండా, బీఆర్ఎన్ తండాలు కొత్త పంచాయతీలుగా ఆవిర్భవించాయి. దీంతో పుల్లూరులోని ఒకటిన్నర ఎకరాల ప్రభుత్వ స్థలంలో వీటిని ఏర్పాటు చేశారు. కాగా, రెండు పంచాయతీలకు క్రీడా మైదానాలను వేర్వేరుగా



ఏర్పాటు చేయాలని ఆయా తండాల ప్రజలు కోరుతున్నారు. ఆ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అనిల్, మహేష్ మాట్లాడుతూ రాజుతండా, బీఆర్ఎన్ తండాల్లో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో పక్కపక్కనే వైకుంఠధామం, క్రీడామైదానం, కంపోస్టు షెడ్‌ల ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

## ప్రమాణాలుంటేనే మద్దతు ధర

ఖమ్మం : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించనున్నారు. ప్రమాణాలుంటేనే మద్దతు ధర లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. టార్పాలిన్లు 2,181, తూకం యంత్రాలు 163, తేమ శాతం కొలిచే యంత్రాలు 185, ట్యాబ్‌లు 164 వరకు సమకూర్చుకున్నారు.

ఇప్పటికే సంఘాలకు చేరిన ధాన్యం...

కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల్లోని 30 కేంద్రాల వద్ద ఇప్పటికే 84,300 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు తెచ్చి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచారు.

కల్లూరులో ప్రారంభించనున్న కలెక్టర్ కల్లూరు మండలం పుల్లయ్యబంజరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే సండ్ర గురువారం ప్రారంభించనున్నారు. జిల్లాలో యాసంగిలో రైతులు పండించిన ధాన్యం 4 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని జిల్లా అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం 230 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.



రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాల్సినవి...

ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు పాస్ పుస్తకం, వాటి నకలు

# మొక్కవోని దీక్ష.. ఓటుతో ప్రజాస్వామ్యానికి రక్ష

సూర్యాపేట హరితహారం కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా నాటిన మొక్కల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోంది. వర్షాలు లేక చాలా వరకు మొక్కలు ఎండిపోతున్నాయి. హరితహార లక్ష్యం ఛేదనలో జిల్లా వెనుకబడే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటోంది. మరోవైపు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటు ప్రాముఖ్యంపై అవగాహన కల్పించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం ఈ నెల 14 నుంచి 20 వరకు "మొక్కను రక్షించండి-ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి" అనే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమానికి హరిత బడ్జెట్ను కేటాయించేలా ఉత్తర్వులు జారీ చేశారు.

విస్తృతంగా అవగాహన

జిల్లాలోని 23 మండలాల్లోని 475 గ్రామ పంచాయతీల్లో, అయిదు పురపాలికల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో హరితహారం కార్యక్రమంలో ఈ ఏడాది లక్షల్లో మొక్కలు నాటారు. ప్రస్తుతం వర్షాలు లేక అవి ఎండుతున్నాయి. ప్రస్తుతం వీటిని కాపాడాల్సి ఉండటంతో మొక్కలకు నీళ్లు పోసే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. కేటాయించిన ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో వారం పాటు మొక్కలకు నీళ్లు పోసే కార్యక్రమం చేపట్టేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా అధికారుల నుంచి మండల స్థాయి అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఈ కార్యక్రమాలు విజయవంతం చేసేలా కార్యాచరణ రూపొందించారు. వారం పాటు జరిగే షెడ్యూల్ నివేదిక అందించాలని గ్రామ, పుర అధికారులు, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.



వారం పాటు..జిల్లాలో వారం పాటు ఈ కార్యక్రమం జరగనుండటంతో రోజు వారీగా ప్రణాళికను సిద్ధం చేశారు. శనివారం సూర్యాపేట పురపాలికలో కలెక్టర్ వెంకటరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. సూర్యాపేట గ్రామీణ ప్రాంతంలో అదనపు కలెక్టర్ ప్రియాంక, ఆత్మకూర్(ఎస్) మండలంలో హుజూర్‌నగర్ ఆర్డీవో, తుంగతుర్తిలో కోదాడ ఆర్డీవో, హుజూర్‌నగర్‌లో అదనపు కలెక్టర్ వెంకట్రెడ్డి, కోదాడలో ప్రత్యేక అధికారులు ప్రారంభించేందుకు కార్యాచరణ రూపొందించారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులు తమ ప్రాంతాల్లో రెండు, మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేలా చర్యలు తీసుకున్నారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, ఎస్‌హెచ్‌జీలు, మెప్మా, ఐకేపీ, సమభావన సంఘం గ్రూపులతో కార్యక్రమాన్ని అమలు చేసేలా ప్రణాళిక రూపొందించారు.


సంరక్షణకు ప్రత్యేక చర్యలు

వెంకటరావు, కలెక్టర్, సూర్యాపేటప్రభుత్వ ఆదేశానుసారం మొక్కల సంరక్షణకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నాం. అంతేకాకుండా ఓటును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేలా అవగాహన చేపట్టనున్నాం. వారం పాటు ప్రతి మొక్కకు నీరందించేలా ప్రణాళిక రూపొందించాం. అందుకు కేటాయించిన అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాల్సి ఉంటుంది. మొక్కల సంరక్షణకు నీళ్లు పోసే కార్యక్రమ ంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరంగా చర్యలు తీసుకుంటాం.

# తుక్కు సామగ్రి పక్కదారి?

భువనగిరి : జిల్లా కేంద్రంలోని విద్యుత్తు నియంత్రికల ప్రత్యేక నిర్వహణ విభాగంలో తుక్కు సామగ్రి పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని విద్యుత్తు డీఈ కార్యాలయం ఆవరణలో కొనసాగుతున్న ఈ కార్యాలయం పరిధిలో గత కొన్నేళ్లుగా మరమ్మతుకు వీలుకాని వందలాది ట్రాన్స్‌ఫార్మర్లను నిల్వ చేశారు. కొత్తగా నిర్మించనున్న విద్యుత్తు ఎస్ఈ కార్యాలయ భవనం కోసం నిల్వ చేసిన నియంత్రికలను అధికారులు వదిలించుకుంటున్నారు. వీటిని తుక్కుగా మార్చి ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సంస్థ స్టోర్స్‌కు ఎస్పీఎం అధికారులు అప్పగిస్తున్నారు. ఈ ప్రక్రియలోనే కొందరు అధికారులు విలువైన రాగి తీగతో పాటు ఇతర పరికరాలను తక్కువగా చూపి స్టోర్స్‌కు అప్పగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

చేతివాటం ఇలా..జిల్లా పరిధిలో మోత్కూరు, ఆలేరు, రామన్నపేటతో పాటు భువనగిరి పట్టణంలో రెండు విద్యుత్తు నియంత్రికల మరమ్మతు కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఆయా కేంద్రాల్లో మరమ్మతులకు వీలుకాని ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు విలువైన సామగ్రిని ఆయా కేంద్రాల వారు విడతల వారీగా ఎస్పీఎం విభాగానికి అందజేస్తుంటారు. అక్కడి అధికారులు సర్వే నివేదిక, అనుమతులతో తుక్కుగా మార్చుతుంటారు. 16, 25, 60, 100 కేవీఏల ట్రాన్స్‌ఫార్మర్లను సంస్థ వినియోగిస్తోంది.



తాజాగా 130 ట్రాన్స్‌ఫార్మర్లకు సర్వే నివేదిక రాగా ఇప్పటికే వంద ట్రాన్స్‌ఫార్మర్లను తుక్కుగా మార్చారు. ఎల్వీ, హెచ్‌వీ కాయిల్స్‌కు ఉన్న రాగి తీగను కాల్చి తుక్కుగా మారుస్తారు. ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ కాల్చడం ద్వార పది శాతం తరుగు చూపించుకునే వెసులుబాటును అధికారులు వినియోగించుకుంటూనే, ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే రాగి తీగను ఐదు నుంచి ఎనిమిది కిలోలు తక్కువగా నమోదు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాయిల్స్, కోర్ బ్లేడులు తుక్కుగా మార్చిన నియంత్రికల స్థానంలో కొత్తవి సంస్థ అందజేస్తున్నప్పటికి రైతులకు, అత్యవసరాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు జారీ చేయకుండా, డబ్బులు ఇచ్చిన వారికి ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

సర్వే నివేదిక ప్రకారమే ప్రక్రియ: రవీందర్, ఏఈ

మరమ్మతులకు వీలుకాని ట్రాన్స్‌ఫార్మర్లను సర్వే నివేదిక ప్రకారమే తుక్కుగా మారుస్తున్నాం. ఈ ప్రక్రియలో అవకతవకలకు ఆస్కారం లేదు. ఇప్పటి వరకు వంద ట్రాన్స్‌ఫార్మర్ల ప్రక్రియను పూర్తి చేశాం. మరో 30 ట్రాన్స్‌ఫార్మర్లకు సర్వే నివేదిక ప్రకారం ప్రక్రియ పూర్తి చేసి స్టోర్స్‌కు అందజేయాల్సి ఉంది.

# యువ ఓటు నీది.. భవిత మీది!



మహబూబాబాద్ : ప్రజాస్వామ్యానికి ప్రాణదీపంగా నిలిచి.. ఐదేళ్లకోసారి నేతల భవితవ్యం తేల్చే తరుణం రానే వచ్చింది. ఎన్నికల్లో యువత ఓట్లు అత్యంత కీలకం. ఓటు నమోదు కోసం ఉత్సాహం చూపే యువత ఆ హక్కును సద్వినియోగం చేసుకోవడానికి మక్కువ చూపడం లేదు. యువత తప్పనిసరిగా ఓటెత్తి సత్తా చూపాల్సిన అవసరం ఉంది.

ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఈ ఎన్నికల్లో యువ ఓట్లశాతం పెంచడానికి ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. వారిలో చైతన్యం కలిగించేందుకు ప్రతి నియోజకవర్గానికి ఒక్కో ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో విధులు నిర్వహించే అంటే పోలింగ్ అధికారి(పీవో) నుంచి అసిస్టెంట్ పోలింగ్ అధికారి (ఏపీవో), పోలింగ్ సిబ్బంది అందరూ యువ అధికారులే ఉంటారు.

మిగిలింది 16 రోజులే..!

ఓటు హక్కు లేదా.. నమోదు చేసుకుందాం మీకు 18 ఏళ్లు నిండినా ఇంకా ఓటరుగా నమోదు కాలేదా.. ఏం ఫర్వాలేదు.. ఇప్పటికీ అవకాశం ఉంది. రాబోయే శాసనసభ ఎన్నికల్లోనూ ఓటు వేయొచ్చు. అయితే వెంటనే దరఖాస్తు చేసుకోండి. అందుకు ఇంకా 16 రోజులే సమయం ఉంది. ఈ నెల 30 తుది గడువు. ఎందుకు ఆలస్యం.. వెంటనే మీ దగ్గర్లోని బీఎల్‌వోని సంప్రదించండి.. వీలుపడకుంటే ఆన్‌లైన్ కేంద్రానికి వెళ్లి ఫారం-6 దరఖాస్తు చేసుకుంటే చాలు ఓటు హక్కు పొందుతారు.

2018 ఎన్నికల్లో ఇలా..

ఉమ్మడి జిల్లాలోని 12 శాసనసభ స్థానాల్లో వరంగల్ పశ్చిమలో అతి తక్కువ ఓటింగ్ శాతం నమోదైంది. ఇక్కడ పూర్తిగా నగర ప్రజలతో కూడిన ఓటర్లుంటారు. ఇందులో యువత అధికంగా ఉంటుంది. 2,40,931 మంది ఓటర్లకు 1,42,698 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేవలం 59.23 శాతం పోలింగ్ నమోదైంది. యువత ఓటింగ్‌కు దూరంగా ఉండడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని గుర్తించారు.

అత్యధిక శాతం నర్సంపేట నియోజకవర్గంలో నమోదైంది. ఇక్కడ 2,09,892 మంది ఓటర్లు ఉండగా 1,89,695 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 90.37 ఓటింగ్ శాతం నమోదైంది. ఈ నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉంటాయి.

ఉమ్మడి జిల్లాలో 14 లక్షలకు పైగా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 18 నుంచి 39 ఏళ్ల వయస్సున్న ఓటర్లు 14,00,257 మంది ఉన్నారు. వీరిలో అత్యధికంగా 30-39 ఏళ్ల వారు 7,55,304 మంది ఉంటారు.. 18-19 ఏళ్ల వయసున్న యువత సంఖ్య గత ఎన్నికలతో పోలిస్తే పెరిగింది. ఇప్పుడు వారి సంఖ్య 80,173 ఉంది. ఈనెలాఖరు వరకు అర్హులు ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

ప్రజాస్వామ్యాన్ని గెలిపిద్దాం..

యువత ఓటు హక్కు వినియోగించుకుంటేనే మంచి నాయకులు ఎన్నికవుతారు. ప్రజాస్వామ్యం పరిపుష్టం అవుతుంది. ఈ నేపథ్యంలో ఓటు హక్కు వినియోగంపై మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలకు చెందిన 100 మంది విద్యార్థుల అభిప్రాయాలను సేకరించింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

వినూత్నంగా చైతన్య కార్యక్రమాలు

ఎన్నికల సంఘం జిల్లాలవారీగా చేపట్టిన చైతన్య కార్యక్రమాలతో కొత్తగా యువ ఓటర్ల సంఖ్య పెరిగింది. మహబూబాబాద్ జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాకు చెందిన పర్వతారోహకుడుడు యశ్వంత్, అర్జున అవార్డు గ్రహీత, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సిక్కిరెడ్డితో ఓటు హక్కు విలువను తెలిసేలా వీడియో చిత్రీకరించి వాటి ఆధారంగా యువతలో చైతన్యం తీసుకొచ్చారు. అవే వీడియోలతో ఓటు నమోదు శాతం పెంచేందుకు కూడా వినియోగిస్తున్నారు.

నేను మీ మానుకోట ఆడబిడ్డ నెలకుర్తి సిక్కిరెడ్డిని. అర్జున అవార్డు గ్రహీతను. నన్ను ఎలక్షన్ కమిషన్ యూత్ ఐకాన్‌గా నియమించింది. నేను ఓటు హక్కును కలిగి ఉన్నాను. ఇప్పుడు 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు అందరూ తప్పనిసరిగా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలి. భారత రాజ్యాంగం మన అందరికీ ఓటు హక్కు కల్పించింది. ఓటు మన హక్కు..మన బాధ్యత. ఓటింగ్‌లో పాల్గొని పోలింగ్ శాతాన్ని పెంచుదాం.

నేను మీ మరిపెడకు చెందిన యశ్వంత్‌ను. భారత పర్వతారోహకుడిని. ఓటుతో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి మీకు ఉంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో అర్హులైన ప్రతి పౌరుడు ఓటు నమోదు చేసుకుని ఓటు వేయాలి. నేను ఆ హక్కును పొందాను. ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోకపోతే వెంటనే చేసుకోండి. రాబోయే ఎన్నికల్లో ఓటు వేసి మంచి భవిష్యత్తును సృష్టించుకుందాం.

అభివృద్ధి చేసేవారికే మొదటి ఓటు

మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకోబోతున్నాను. అభివృద్ధి చేసే వారికే ఓటు వేస్తాను. నా కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులకు ఓటు విలువ గురించి వివరిస్తాను.

జిల్లోజు ఉష్మశ్రీ, పెద్దనాగారం

ప్రజా సమస్యలు పరిష్కరించేవారికే.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించేవారికి ఓటు వేస్తాను. మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోబోతున్నందుకు అదృష్టంగా భావిస్తున్నా.

మేకల సందీప్‌కుమార్, రామన్నగూడెం

# గణితం.. భవితకు మార్గనిర్గనిర్దేశం..

సంగారెడ్డి : గణితంలో పట్టు సాధిస్తే ఉజ్వల భవిత ఖాయం. ఎంతో మంది విద్యార్థుల్లో ఈ అంశం అంటే కాస్త వెనుకడుగు వేస్తుంటారు. పదో తరగతి వరకు ఎలాగోలా నెట్టుకొస్తూ ఇంటర్, డిగ్రీ స్థాయిలో ఆ సబ్జెక్టు లేకుండా కోర్సును ఎంచుకుంటారు. కొందరు మాత్రం ఇందుకు భిన్నం. గణితంలో పట్టు సాధించడమే లక్ష్యంగా ముందుకుసాగుతారు. ఇలాంటి వారికి సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మార్గనిర్దేశం చేసేందుకు ముందుకొచ్చింది. సదస్సులు, శిక్షణ కార్యక్రమాలతో ప్రతిభాన్వితులుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం విశేషం.

మ్యాథమెటిక్స్ ట్రైనింగ్ అండ్ టాలెంట్ సెర్చ్ (ఎంటీటీఎస్) పేరిట కళాశాల విద్యాశాఖ గణితంలో విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమానికి 32 కళాశాలలను ఎంపిక చేయగా ఈ జాబితాలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చోటు దక్కడం విశేషం. గత విద్యా సంవత్సరం నుంచి ఈ కార్యక్రమం కొనసాగుతోంది. కళాశాలలో జాతీయస్థాయి శిక్షణ రెండు రోజుల పాటు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన 10 మంది అధ్యాపకులతో పాటు 15 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

మెలకువలు నేర్పిస్తూ..

గణితంలో రాణించాలంటే అందులో మెలకువలు నేర్చుకోవడం ఎంతో ముఖ్యం. ఈ క్రమంలో విద్యార్థులకు సులభ పద్ధతులు పరిచయం చేస్తూనే ప్రతిభ చాటేలా చేయడమే ఎంటీటీఎస్ లక్ష్యం. గణిత అధ్యాపకులకు సైతం తర్ఫీదు ఇస్తారు. ఇందుకు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ ఇప్పిస్తారు. తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 5, 6 తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలోని శివనాడార్ విశ్వవిద్యాలయానికి చెందిన సత్యనారాయణరెడ్డి, త్రిపుర విశ్వవిద్యాలయానికి చెందిన భట్టాచార్య ప్రధాన వక్తలుగా వ్యవహరించి వివిధ అంశాల్లో దిశానిర్దేశం చేశారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలు సైతం అందిస్తున్నారు.

శిక్షణ.. రాణించేలా కార్యాచరణ

విద్యార్థులను మెరుగ్గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వారు ఇతర రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో నిర్వహించే వారం, 15 రోజుల వ్యవధి శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంటుంది. విద్యార్థులు అక్కడికి వెళ్లేందుకు రానుపోను ఛార్జీలు ఉన్నత విద్యాశాఖ భరిస్తుంది. గణితంలోని ప్రధాన అంశాల్లో నైపుణ్యాల పెంపే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి తెర తీశారు. సమస్యల సాధనకు ఫార్ములాల వినియోగం, వాటిని ఎలా ఉపయోగించాలి, సులభంగా లెక్కలు చేయడంపై అవగాహన కల్పిస్తున్నారు. గణితంలో పట్టు సాధిస్తే ఎలాంటి అవకాశాలు ఉంటాయో కూడా వివరిస్తున్నారు. ప్రైవేటు రంగంలోనూ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సబ్జెక్టులో రాణించేలా ప్రణాళికతో ముందుకుసాగాలని సూచిస్తున్నారు.

కళాశాల ఏర్పాటు: 15.07.1977 తరగతి గదులు: 38 ప్రయోగశాలలు: 20 అధ్యాపకులు: 20కోర్సులు: 41పీజీ: 10డిగ్రీ విద్యార్థులు: 38 పీజీ విద్యార్థులు: 580 గణితం విద్యార్థులు: 540

# పచ్చి ధాన్యం కొనుగోలు



సిరిసిల్ల : ఈ సీజన్‌లో వర్షాలు ఆలస్యమైనా వరి సాగు చేసిన రైతుల్లో ఆశలు నింపింది. జిల్లాలో 1.81 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా తొలుత నాట్లు పూర్తి చేసుకున్న ప్రాంతాల్లో ఇప్పటికే కోతలు ప్రారంభమయ్యాయి. చందుర్తి, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లో వ్యాపారులు పొలాల వద్దే పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. దొడ్డు రకం ధాన్యం క్వింటాలుకు రూ.1,800 చొప్పున చెల్లిస్తున్నారు. కామారెడ్డి, సిద్దిపేట, కోరుట్ల మిల్లర్లు తమ ఏజెంట్లను పంపి తూకాలు వేయిస్తున్నారు. ధాన్యం మిల్లుకు చేరిన వారం, పది రోజుల్లో నగదు జమ చేస్తామని రైతులతో మాట్లాడుకుంటున్నారు. మరోవైపు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను నవంబరు మొదటి వారంలో ప్రారంభించేలా అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు. ఇప్పటికే అధికార యంత్రాంగం ఎన్నికల అదనపు బాధ్యతల్లో ఉంది. ఒక వేళ తెరిచినా పూర్తిస్థాయిలో సన్నద్ధమై తూకాలు ప్రారంభమయ్యేసరికి చలి తీవ్రత పెరుగుతుంది. మారుతున్న వాతావరణ పరిస్థితులతో ధాన్యాన్ని ఆరబెట్టాలి. తేమ శాతం 17 లోపు ఉండాలి. దాని కోసం రైతులు రోజుల తరబడి కేంద్రాల్లో పడిగాపులు పడాలి. ముందుగా కోతలు పూర్తయిన ధాన్యాన్ని వ్యాపారులకు విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈసారి ప్రభుత్వం వరి మద్దతు ధర క్వింటాకు సాధారణం రూ. 2,183, ఏ-గ్రేడుకు రూ.2,203 నిర్ణయించింది.

వ్యాపారులకు లాభం

గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేసే వ్యాపారులు, మిల్లర్లు తూకం దగ్గర నుంచి తరలింపు బాధ్యతలను వారే చూసుకుంటారు. పచ్చి ధాన్యం కొనుగోలు చేసిన వ్యాపారులు, మిల్లర్లు వాటిని ఆరబెట్టడం, శుద్ధి చేసేందుకు ప్రత్యేక యంత్రాలుంటాయి. రైతుల పొలాలు, ఇళ్ల వద్ద తూకం వేసిన ధాన్యంలో తరుగు, తేమ పేరిట క్వింటాలుకు రెండు, మూడు కిలోలు అదనంగా తూకం వేస్తారు. ఇందులో ఎక్కువగా సన్న రకాలుంటాయి. వీటిని నిల్వ చేసి మార్కెట్ డిమాండ్‌ను బట్టి మరాడించి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తారు. పెరిగిన సాగు విస్తీర్ణం, దానికి తగ్గట్టుగా దిగుబడులు ఈసారి కొనుగోళ్ల ప్రక్రియ అధికారులకు సవాల్‌గా మారనుంది. వీటన్నింటికీ తోడు ఎన్నికలు జరుగుతుండటం పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

త్వరలో కేంద్రాలు ప్రారంభిస్తాం- ఎ.జితేంద్ర ప్రసాద్, పౌర సరఫరాల శాఖ మేనేజర్

ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. వ్యవసాయశాఖ ఇచ్చిన నివేదిక ఆధారంగా దిగుబడి అంచనా మేరకు కొనుగోళ్లకు ప్రణాళికలు చేశాం. జిల్లాలో గ్రామీణాభివృద్ధిశాఖ (ఐకేపీ), పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల ద్వారా 258 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. స్థానిక అవసరాలు, విత్తనోత్పత్తిని మినహాయిస్తే 3.5 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి తగ్గట్టుగా గన్నీ సంచులు, తూకం, శుద్ధి యంత్రాలు, టార్పాలిన్లు సిద్ధంగా ఉన్నాయి. త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం.

దిగుబడి అంచనా 3.76 లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో సీజన్ ప్రారంభంలో వేసిన పంట చేతికందుతుండగా ఆయకట్టు భూముల్లో వరి కోతలు కాస్త ఆలస్యం కానున్నాయి. కొన్ని మండలాల్లో వరి పైరు ఇప్పుడిప్పుడే పొట్టదశకు చేరుకోవడం గమనార్హం. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో అన్నదాతలు వరికోతలపై దృష్టి సారించారు. వరి సాగు విస్తీర్ణాన్ని బట్టి 3.76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

దిగుబడిపై మొగి పురుగు ప్రభావం: వాతావరణంలో మార్పుల వల్ల వరిలో మొగిపురుగు ఉద్ధృతంగా ఆశించింది. ఇటీవల తరచూ ఆకాశం మేఘావృతమవడం, వర్షాలు కురవడంతో గాలిలో తేమశాతం అధికమై ఈ పురుగు వేగంగా వ్యాప్తి చెందింది. దీంతో కంకి (ఊస పోవడం) తెల్లగా మారింది. అత్యధిక శాతం విస్తీర్ణంలోని వరి పొలాలు ఈ మొగిపురుగు బారిన పడ్డాయి. మొగిపురుగుతో ఈ ఏడాది దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. కొన్ని చోట్ల రెండు, మూడు సార్లు పురుగు మందులను వాడినప్పటికీ ఉద్ధృతి తగ్గలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా చేతికందిన పంటను రైతులు వెనువెంటనే కోయిస్తున్నారు.

# ఎన్నికల్లో నిమగ్నం.. ఆక్రమణలు నిర్విఘ్నం

సిద్దిపేట : జిల్లాలు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో ఇక్కడి భూములకు డిమాండ్ ఎంతో ఉంది. ప్రస్తుతం అధికారులు తమ దృష్టి ఎన్నికలపై పెట్టారు. ఇదే సమయంలో కబ్జాదారులు ప్రభుత్వ భూములపై కన్నేశారు. రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపడుతున్నారు. అసైన్డ్, ప్రభుత్వ భూములు, కుంట, చెరువు శిఖాలు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మాణాలు వెలుస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా జిన్నారం మహానగరానికి సమీపంలో ఉండటంతో దందా జోరందుకుంది. పలు గ్రామాల్లో కేసులు నమోదు అయ్యాయి.

నిర్మాణాలు చేపట్టి..కబ్జాదారులు ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టి రంగులు వేస్తే ప్రస్తుతానికి గట్టెక్కవచ్చనే భావనతో కబ్జాదారులు ఉన్నారు. ఇక మరికొంతమంది ప్రభుత్వ భూముల్లో గతంలో నిర్మించిన వాటిని కూల్చివేసి శాశ్వత భవనాలకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. జిల్లా స్థాయిలో ఓ టాస్క్‌ఫోర్స్‌తో పాటు మండలానికి ఒకరిద్దరు నిఘా అధికారులను నియమిస్తే ప్రభుత్వ భూముల రక్షణ సాధ్యమవుతుంది. తాజాగా జిన్నారం, నర్సాపూర్ ప్రాంతాల్లో ఇవి వెలుగులోకి వచ్చాయి.

ప్రత్యేక విభాగం ఉంటేనే..

ప్రస్తుతం ప్రత్యేక విభాగం ఎంతో అవసరం. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు రక్షణ సిబ్బంది అన్యాక్రాంతంపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఎంతో ఉంది. రాత్రి వేళల్లో నిర్మాణాలు చేపడుతుంటారు. వాటిని గుర్తించి దాఇ చేసేందుకు రక్షణ సిబ్బంది అవసరం. ఈ విషయంలో సంబంధిత అధికారులు దృష్టిసారించాలి.

వందెకరాలకు పైగా..నర్సాపూర్‌లో అత్యంత విలువైన సర్వే నెంబర్లు 79, 731, 76, 114, 116, 126, 531, 80, 67లలో వందల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయి. వీటిల్లో చాలా వరకు సాగు భూములను ప్లాట్లుగా మార్చేశారు. సర్వే నంబరు 79లో 186.50 ఎకరాలు ఉండగా, ఇందులో వంద ఎకరాలకు పైగా పేదలకు నాలుగు దశాబ్దాల క్రితం అసైన్డు చేశారు. కొన్నేళ్ల పాటు ఇందులో వ్యవసాయం చేయగా.. క్రమక్రమంగా విలువ పెరగడంతో ఆక్రమణకు తెర తీశారు. మరోవైపు కొందరు తక్కువ ధరకే లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఇటీవల 75 వరకు అక్రమ నిర్మాణాలను గుర్తించారు. రెవెన్యూ అధికారులు సూచికలు బిగించి చేతులు దులుపేసుకున్నారు. దీనిపై అక్రమార్కుల కన్ను ఉంది. ఇదే అదునుగా మళ్లీ అన్యాక్రాంతం చేసే అవకాశం లేకపోలేదు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్, రామచంద్రాపురం, జిన్నారం, గుమ్మడిదల, హత్నూర, సంగారెడ్డి తదితర చోట్ల ఇలాంటి సమస్య నెలకొని ఉంది.

శిఖం.. కనిపిస్తే ఖతమ్..!సిద్దిపేట జిల్లాలో కబ్జా ఉదంతాలు అడపాదడపా వెలుగుచూస్తున్నాయి. చేర్యాల మండలం నాగపురి శివారులో కొండపోచమ్మ చెరువు శిఖం భూమిలో, చేర్యాల కుడి చెరువు బఫర్ జోన్‌లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. కొమురవెల్లి మండలం గురువన్నపేటలో ఓ కుంట శిఖం భూముల కబ్జాకు స్థిరాస్తి వ్యాపారులు కన్నేశారు. సిద్దిపేట కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో అనుమతి లేని వెంచర్లు వెలుస్తున్నాయి. హుస్నాబాద్‌లో కొత్త చెరువు శిఖంలో నిర్మాణానికి యత్నించగా అధికారులు కట్టడి చేశారు. ప్రత్యేక నిఘా..రవీందర్‌రెడ్డి, ఆర్డీవో, సంగారెడ్డిఎన్నికల సమయంలో ప్రభుత్వ భూముల ఆక్రమణకు అవకాశం ఉంటుందని ముందే గుర్తించాం. ఈ సమయంలో నిఘాపై దృష్టిసారించాం. ఎవరైనా కబ్జాకు పాల్పడితే మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటాం. అందరూ సహకరించి ప్రభుత్వ భూముల రక్షణకు తోడ్పడాలి.

# ఆధారాలుంటే తిరిగిస్తారు!

సిరిసిల్ల :అసెంబ్లీ ఎన్నికల కోసం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయటంతో కోడ్ అమల్లోకి వచ్చింది. గ్రామాలు, పట్టణాలు అని తేడా లేకుండా జిల్లా అంతటా నిఘా ఏర్పాటు చేశారు. ఎన్నికల వేళ డబ్బు, మద్యం, చీరలు, గిఫ్టులు ఇలా ఓటర్లను ప్రభావితం చేసేవి ఏదైనా సరే పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించి ఎలాంటి ప్రలోభాలు లేకుండా సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా సరిహద్దుల్లో 7, వివిధ ప్రాంతాల్లో 8 మొత్తం 15 చెక్‌పోస్టులను ఏర్పాటు చేయగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వీడియో రికార్డింగ్ చేస్తున్నారు. 24 గంటలపాటు బృందాలు తనిఖీల్లో నిమగ్నమవుతున్నారు. ఇప్పటి వరకు మల్యాల మండలం రాజారం వద్ద రూ.2 లక్షలు, కోరుట్లలో రూ.70 వేలు, కథలాపూర్ మండలంలో రూ.6.60 లక్షలు పోలీసులకు చిక్కాయి. ఆ సొమ్మును స్వాధీనం చేసుకున్న పోలీసులు కోరుట్ల ఎస్‌బీఐ బ్యాంకులో భద్రపరిచారు. కమిటీ పరిశీలన తర్వాతే..జిల్లాలో ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్న డబ్బుల పరిశీలన కోసం గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేసింది. ఛైర్మన్‌గా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న జి.శ్రీనివాస్‌రావు, నోడల్ ఆఫీసర్‌గా ఉన్న డి.సుజాతను కన్వీనర్‌గా, జిల్లా ట్రెజరీ అధికారిగా ఉన్న సి. హెచ్.సోఫియాను సభ్యులుగా నియమించారు. వ్యాపారం, ఇంటి అవసరాలు, వైద్యం, ఇతర అవసరాలకు డబ్బులు తీసుకు వెళుతున్న సమయంలో ఎలాంటి ఆధారాలు చూపించకపోతే పోలీసులు కచ్చితంగా స్వాధీనం చేసుకుని సీజ్ చేస్తారు. డబ్బే కాకుండా ఓటర్లకు గిఫ్టుగా ఇచ్చే ఎలాంటి వస్తువులు అధిక మొత్తంలో దొరికినా సీజ్ చేస్తారు. ఏదైనా పార్టీ వారికి చెందిన వారైతే కచ్చితంగా వెంటనే కేసు నమోదు చేస్తారు.

# చైతన్య వీచిక.. అభివృద్ధి సూచిక

ఖమ్మం :అది ఓ చిన్న గ్రామం. రజాకార్లకు ఎదురొడ్డిన పల్లె.. నాటి పోరాట స్ఫూర్తి చైతన్య దీప్తి అవుతోంది. సాధారణ కుటుంబాలు అయినా పిల్లలను ఉన్నతంగా చదివిస్తున్నారు. ఉద్యోగులు యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు. వెరసి ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఉంది. ఈ పరంపర కొనసాగిస్తూనే ఉన్నారు. ఇటీవల బ్యాంకు, పోలీసు ఉద్యోగాలు సాధించారు. అదే.. మధిర మండలం ఖాజీపురం గ్రామం ఘనత. సామాజిక స్పృహ, చదువుపై ఆసక్తితో పలు రంగాల్లో ఉద్యోగాలు సాధించిన తొలితరం వారు నేటి యువతకు ఆదర్శమవుతున్నారు.గ్రామంలో 250 కుటుంబాలుండగా 520 ఓట్లు ఉన్నాయి. 650 మంది జనాభా ఉన్నారు. ప్రతి కుటుంబంలో ఒక సర్కారు కొలువు, ఇరవై కుటుంబాల్లో దంపతులిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు 150 మంది, పోలీస్‌శాఖలో 30 మంది, పశుసంవర్ధకశాఖలో 15 మంది, ఇంజినీరింగ్ విభాగంలో 20 మంది, బ్యాంకింగ్ రంగంలో 10 మంది ఇలా ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లోనే కాకుండా ప్రైవేటు రంగంలోనూ గ్రామ యువకులు రాణిస్తున్నారు. విదేశాల్లో ఇరవై మంది వరకు వివిధ వృత్తులు చేపట్టారు. వైద్యులు, ఇంజినీర్లుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారున్నారు.

వందశాతం అక్షరాస్యత.. సీసీ రోడ్లు

మొదటి నుంచి స్థానిక ప్రజాప్రతిధులు, గ్రామస్థుల సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వ నిధులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధిస్తున్నారు. గ్రామం వందశాతం అక్షరాస్యత సాధించింది. వేలిముద్ర వేసేవారే ఇక్కడ లేరంటే అతిశయోక్తికాదు. గ్రామంలో నూరు శాతం అంతర్గత రహదారులు సిమెంటు రోడ్లుగా మారాయి. ప్రధాన రహదారి పక్కన ప్రభుత్వ స్థలంలో గ్రామీణ ఠాణా ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యాలయం, షాదీఖానా భవనం అందుబాటులోకి వచ్చాయి. అంగన్‌వాడీ భవనం, పల్లెప్రకృతివనం, క్రీడా ప్రాంగణం, ఖబరస్థాన్ ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశారు. ఇక్కడకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి అభ్యసిస్తున్నారు.

పిల్లలను చదివిస్తూ...

గ్రామం మొదటి నుంచి చైతన్యం ఎక్కువే. నైజాం, రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో గ్రామస్థులు ఎందరో పాల్గొన్నారు. కొద్దిపాటి ఆదాయంతోనే అప్పటి నుంచి తమ పిల్లలను చదువుపై ఉన్న ఆసక్తితో వివిధ ప్రాంతాలకు పంపి వారికి ఉన్నత విద్య అందించారు. వైద్యులు, ఇంజినీర్లు, ప్రభుత్వ ఉపాధ్యాయులుగా, వివిధ శాఖల్లో ఉద్యోగాలు నిర్వహిస్తున్న వారు రంజాన్ పర్వదినం గ్రామాన్ని చేరతారు. కలిసిమెలిసి పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు.ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరికి విద్యపై ఆసక్తి ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగస్తులు ఇతరులకు సహాయపడటం పరిపాటిగా మారింది. నేటి యువతలో ఎక్కువమంది సాఫ్ట్‌వేర్ కొలువుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

జమీర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

గ్రామంలో మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తున్నాం. రహదారులు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా సమష్టిగా కృషిచేస్తాం.ఫర్జానాబేగం, సర్పంచి

# పాల్వంచ జీసీసీ అక్రమాలపై ఐటీడీఏ దృష్టి

ఖమ్మం : భద్రాచలం జీసీసీని వివాదాలు వీడటం లేదు. అక్రమాల గుట్టు రట్టు చేసేందుకు డీఎం విజయ్‌కుమార్‌తో పాటు ఐటీడీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో గిరిజన సహకార సంస్థ పాల్వంచ శాఖలో రూ.20 లక్షలకుపైగా లెక్కల్లో తేడాలను ప్రాథమికంగా గుర్తించారు. ఇది 2020-21లో చోటు చేసుకోవడంతో ఆ సమయంలో అక్కడ మేనేజర్‌గా ఉన్న వీరభద్రస్వామిని ఇటీవల సస్పెండ్ చేశారు. మళ్లీ ఇప్పుడు నోటీసులు జారీ చేసేందుకు కసరత్తు మొదలైంది. ఆ తరుణంలో విధులు నిర్వహించిన ఉద్యోగుల ప్రమేయం ఏ మేరకు ఉందో తెలుసుకోనున్నారు. త్వరలోనే పాత్రధారులు, సూత్రధారులు ఎవరన్నది నిగ్గు తేల్చనున్నారు. రూ.లక్షల్లో సరకులు గోల్‌మాల్ కావడం వెనుక మతలబు ఏంటన్నది ఒకొక్కటిగా బయటకు వస్తుండటంతో ఈ అంశం సంచలనంగా మారుతోంది. కొవిడ్ సమయంలో పాల్వంచ బ్రాంచి పరిధిలో నిత్యావసర సరకుల లెక్కలను పరిశీలిస్తే రూ.20 లక్షల విలువైన ఆహార, ఆహారేతర పదార్థాల ఆచూకీ లభ్యం కాలేదు. ఆ తరుణంలో దుకాణాలు తెరవకపోవడంతో ఇవి పాడయ్యాయన్నది ఒక వాదన. కాలం చెల్లిన మిరియాలు, మూడేళ్లపాటు నిల్వ ఉండే పీనాయిల్ వంటివి సైతం పాడయ్యాయని చెప్పడంతో సందేహాలు తలెత్తుతున్నాయి. పప్పు దెబ్బతిని ఉంటే దీన్ని ఏం చేశారన్న ఆధారం కోసం వీడియోగానీ, ఫొటోలు గానీ లేకపోవడం అనుమానం కలిగిస్తోంది. ప్రభుత్వ పరిధిలోని సంస్థకు చెందిన సరకులను పడేయాలంటే ఉన్నతాధికారుల అనుమతి ఉండాలి. సరకు



తగ్గుదలకు కొవిడ్‌ను కారణంగా చూపిస్తున్నప్పటికీ ఆ సరకు ఏమైందన్నది స్పష్టత లేకపోవడంతో విచారణ చేపట్టనున్నారు. ఈ సరకు నిల్వ ఉన్న తరుణంలో కొంత కాలం కొవిడ్ ఆంక్షలను సడలించినప్పటికీ ఎందుకు విక్రయించలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

మిగతా బ్రాంచిలపైనా...ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ప్రత్యేక దృష్టితో జీసీసీ లెక్కలను తేల్చేందుకు ఇటీవల ఐదుగురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఆ బృందం ఇచ్చిన నివేదికలను పరిశీలిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాచలం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, దమ్మపేటల్లో జీసీసీకి బ్రాంచులున్నాయి. ప్రస్తుతం పాల్వంచ వివాదంపై దృష్టి సారించినా మిగతా వాటిపైనా సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా ముష్టి గింజల కొనుగోళ్లతో పాటు కొన్ని పెట్రోలు బంకుల నిర్వహణలో అవకతవకల పైనా తీవ్ర విమర్శలు ఉన్నాయి. ఇలాంటి వాటిపై లోతుగా ఆరా తీస్తున్నట్లు సమాచారం. జీసీసీలోని అన్ని బ్రాంచిల్లో లెక్కలు సక్రమంగానే ఉన్నాయని, పాల్వంచ బ్రాంచి పరిధిలో కొంత తేడా రావడంతో తగు చర్యలు తీసుకుంటున్నట్లు జీసీసీ డీఎం విజయ్‌కుమార్ తెలిపారు.

# అద్దెకు వ్యవసాయ యంత్రాలు



ఖమ్మం : చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ యంత్రాలు, పరికరాలను తక్కువ ధరకు అద్దెకు ఇస్తున్నారు. గ్రామాల్లో కూలీల సంఖ్య తగ్గిపోవటం, వారికి చెల్లించే వేతనాలు ఎక్కువగా ఉండటంతో రైతులు వ్యవసాయ యాంత్రీకరణ వైపు మొగ్గుతున్నారు. ఈ క్రమంలోనే మండల సమాఖ్య కేంద్రాల్లో రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రాలను(కస్టమ్ హైరింగ్ సెంటర్) ఏర్పాటు చేశారు. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్(ఎన్‌ఆర్ఎల్ఎమ్) పథకంలో భాగంగా రాయితీతో బ్యాంకు రుణాలు, మండల సమాఖ్యల వాటాధనంతో ఈ యంత్ర పరికరాలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. దుక్కి దున్నడం మొదలు, విత్తడం, కలుపు తీయడం, పంట పండిన తర్వాత నూర్పిడి చేయటం వంటి అవసరాలకు ఉపయోగపడే ట్రాక్టరు, స్ప్రేయర్లు, రోటోవేటర్, నాటు వేసే యంత్రాలు, కల్టివేటర్ తదితర పరికరాలతో అద్దె కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఈ పరికరాలను అద్దెకు ఇవ్వటం వల్ల సమాఖ్య మహిళలకు ఆదాయం సమకూరనుంది.

డ్రైవరు లేని ట్రాక్టర్లు

రైతులకు తక్కువ ధరకు అద్దెకు పరికరాలు ఇవ్వడం లక్ష్యం గొప్పదే అయినప్పటికీ అమలులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆధునిక పరికరాల వాడకంపై రైతులకు పూర్తి అవగాహన లేకపోవటం వల్ల చాలాచోట్ల తీసుకెళ్లడం లేదు. ట్రాక్టర్లకు డ్రైవరు లేకపోవటం వల్ల కొన్ని చోట్ల నామమాత్రంగా అద్దె కేంద్రాల నిర్వహణ కొనసాగుతోంది. 2020లో పైలెట్ ప్రాజెక్టు కింద ఖమ్మం జిల్లాలోని సింగరేణి మండలంలో సీహెచ్‌సీ కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడ రైతులు యంత్రాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. 2021లో వేంసూరు, బోనకల్లు, రఘునాథపాలెం, కూసుమంచి మండలాల్లో 2022లో కొణిజెర్ల, 2023లో పెనుబల్లి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో అద్దె కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ మొత్తం 9 మండలాల్లో సీహెచ్‌సీ కేంద్రాలు ఉన్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2020లో టేకులపల్లి, పినపాక, మణుగూరు, ములకలపల్లి మండలాల్లో అద్దె కేంద్రాలను ఏర్పాటు చేయగా ఈ సంవత్సరం మరో 16 మండలాల్లో ఏర్పాటు చేశారు. ఇక్కడ మొత్తం 20 మండలాల్లో సీహెచ్‌సీ కేంద్రాలు ఉన్నాయి.

# ప్రచార క్షేత్రంలోకి గులాబీ దండు



ఖమ్మం : శాసనసభ ఎన్నికల అభ్యర్థుల ప్రకటనతో అన్ని పార్టీల కన్నా ముందున్న భారాస.. మిగతా పార్టీల్లో అభ్యర్థుల లెక్కలు తేలకముందే క్షేత్రస్థాయిలో ప్రచారం ముమ్మరం చేయాలని నిర్ణయించింది. ఆగస్టు 21న అభ్యర్థుల ప్రకటన తర్వాత ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో పార్టీని చక్కబెట్టుకోవటం, ఆత్మీయ సమ్మేళనాల వంటి కార్యక్రమాలు చేపట్టింది. ఇక ప్రచార పర్వంపై దృష్టి కేంద్రీకరించనుంది. నియోజకవర్గాల వారీగా ప్రచారం, సమన్వయం కోసం ముఖ్యనేతలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించింది. అదే సమయంలో అసంతృప్తులను బుజ్జగిస్తూ ఇతర పార్టీల్లోని కీలక నేతలను తమవైపు తిప్పుకొనేందుకు వ్యూహాలు రచిస్తోంది. ఉభయ జిల్లాల్లో నియోజకవర్గాల వారీగా విస్తృతస్థాయి ఎన్నికల ప్రచారాన్ని శనివారం పూరించనుంది.

ఎప్పటికప్పుడు సీఎం దిశానిర్దేశం

2014, 2018 ఎన్నికల్లో భారాస (నాటి తెరాస)కు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిరాశజనకమైన ఫలితాలు ఎదురవటంతో సీఎం కేసీఆర్ ఈసారి ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులు, ఎన్నికల సమన్వయంపై అంతర్గత సర్వేల ద్వారా అందిన వివరాల ఆధారంగా ఎప్పటికప్పుడు అభ్యర్థులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రచారంలో దూకుడు పెంచాలని సూచిస్తున్నట్లు తెలిసింది. భారాస హయాంలో జరిగిన అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచిస్తున్నట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో పార్టీకి ఆదరణ బాగున్నా.. అభ్యర్థుల ప్రతికూలతలను పసిగట్టి బలమైన నాయకులకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. రెండు నియోజకవర్గాల్లో అభ్యర్థుల కుటుంబీకుల ప్రమేయం పార్టీకి ఇబ్బందిగా పరిణమించే అవకాశముందని గుర్తించి.. ఆయా కుటుంబ సభ్యులను ప్రచారానికి దూరంగా ఉంచాలని ఇన్‌ఛార్జిలు, అభ్యర్థులను సీఎం ఆదేశించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఉభయ జిల్లాల్లో ఇద్దరు కీలక నేతలు పొంగులేటి శ్రీనివా సరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు భారాసను వీడి కాంగ్రెస్ గూటికి చేరటంతో వారు పోటీ చేసే స్థానాలపైనా కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.

బహిరంగ సభలకు ముమ్మర ఏర్పాట్లు

మండలాలు, గ్రామాల వారీగా ప్రచారం ప్రారంభించేలా భారాస అభ్యర్థులు, ఇన్‌ఛార్జిలు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రత్యేక బృందాలను సిద్ధం చేస్తున్నారు. ఉభయ జిల్లాల్లో భారాస నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. గ్రామాలు, మండలాల వారీగా నాయకులు, ముఖ్య కార్యకర్తలతో ఎన్నికల ప్రచార కార్యక్రమాల జాబితాను ఈ సమావేశాల్లోనే తయారుచేయనున్నారు. ఖమ్మంలో ఎన్నికల ప్రచార శంఖారావాన్ని మంత్రి పువ్వాడ అజయ్ శనివారం పూరించనున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లోనూ ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాలు, సామాజిక వర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసిన భారాస నేతలు.. ప్రచారానికి శ్రీకారం చుట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 27న పాలేరు, నవంబర్ 1న సత్తుపల్లి, ఇల్లెందు, 5న ఖమ్మం, కొత్తగూడెం నియోజకవర్గాల్లో నిర్వహించే భారాస బహిరంగ సభలకు సీఎం కేసీఆర్ హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. బహిరంగ సభలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. అభ్యర్థులకు బీ-ఫారాలను అధిష్ఠానం ఆదివారం అందజేయనుంది. ఆతర్వాత అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు క్షేత్రస్థాయిలోనే తిష్ఠవేసి ప్రచారపర్వంలో దూసుకెళ్లేలా గులాబీదళం ప్రణాళికలు రచిస్తోంది.

420 ప్రాంతాలు.. 684 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

ఖమ్మం జిల్లాలో 390, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 294 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పోలింగ్ సమయంలో ఆయా కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టనున్నారు. మొత్తమ్మీద ఖమ్మం జిల్లాలో 1,455, భద్రాద్రి జిల్లాలో 1,095 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. భద్రాచలం నియోజకవర్గంలో అధికంగా 129, అశ్వారావుపేట నియోజకవర్గంలో అత్యల్పంగా ఏడు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయి.

గత ఎన్నికల్లో సుమారు 12,670 మంది బైండోవర్

2018, 2019లో జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఉభయ జిల్లాల్లో నేర చరిత్ర కలిగిన 12,670 మందిని పోలీసులు బైండోవర్ చేసినట్లు ఖమ్మం సీపీ విష్ణు వారియర్, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ వినీత్ ఇటీవల వెల్లడించారు. ఎన్నికల విధులు, పోలింగ్ ప్రక్రియకు విఘాతం కలిగించటం, ఓటర్లను బెదిరించటం, భయపెడతారనే అభియోగాలపై ముందస్తుగా 12,670 మందిని బైండోవర్ చేశారు. గత ఐదేళ్లలో నేర చరిత్ర కలిగిన వారు పెరిగినట్లు సమాచారం. ఈసారి 13 వేల మందికి పైగా వ్యక్తులను బైండోవర్ చేయనున్నారు. రౌడీషీటర్లు, దొమ్మీలకు పాల్పడేవారు, ఇతరత్రా ప్రజలను భయాందోళనలకు గురిచేయటం సహా వివిధ రకాల నేర చరిత్ర కలిగిన వారిని గుర్తించి సంబంధిత తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయనున్నారు. వారంతా రోజూ తహసీల్దార్ల ఎదుట హాజరుకావాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు వారిపై పోలీసు నిఘా కొనసాగుతుంది.

177 మంది వద్ద ప్రైవేటు తుపాకీ లైసెన్స్‌లు

ఉభయ జిల్లాల్లో 177 మంది ప్రైవేటు వ్యక్తులకు తుపాకీ లైసెన్స్‌లు ఉన్నాయని పోలీసు అధికారులు చెబుతున్నారు. బ్యాంకుల్లో సెక్యూరిటీ కోసం 34 తుపాకులకు లైసెన్స్‌లు ఉన్నాయి. బ్యాంకు సెక్యూరిటీ నేపథ్యంతో ఈ తుపాకులు వినియోగించుకోవచ్చు. మిగతా వారంతా తమ ఆయుధాలను సమీప పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఎన్నికలు ముగిసే వరకు ప్రైవేటు వ్యక్తులు తమ ఆయుధాలను పోలీసుల వద్ద భద్రపరచాలి.

# ఎన్నికల నిర్వహణ వ్యయం రూ.10 కోట్లు!



ఖమ్మం : అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ వ్యయం ప్రతిసారీ పెరిగిపోతోంది. ప్రస్తుతం ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు రూ.2 కోట్లు చొప్పున, జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు రూ.10 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిసింది. 2018లో ఒక్కో నియోజకవర్గానికి రూ.1.5 కోట్లు కేటాయించారు. తాజా వ్యయంలో పోలీసు శాఖ ఖర్చు చేర్చలేదు. ఎన్నికల నిర్వహణలో ఓటర్ల జాబితాల ముద్రణ నుంచి పలు రకాల శిక్షణలు, ఈవీఎంల భద్రత, రక్షణ, తరలింపు, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన.. ఇలా ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు నిర్వహించే అన్ని కార్యక్రమాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా బడ్జెట్ ఇస్తారు.

నాలుగు మోడల్ పోలింగ్ కేంద్రాలు

ప్రతి నియోజకవర్గంలో నాలుగు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. యువత పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సిబ్బంది అంతా యువతనే నియమిస్తారు. మహిళ కేంద్రంలో సిబ్బందిగా మహిళలు, దివ్యాంగుల పోలింగ్ కేంద్రంలో లభ్యత మేరకు దివ్యాంగులను నియమిస్తారు. మరో కేటగిరీలోని ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దుతారు. ఓటు వేసేందుకు వచ్చిన వారిని సగౌరవంగా ఆహ్వానిస్తారు. నిలబడి నిరీక్షించకుండా కుర్చీలు ఏర్పాటు చేస్తారు. నియోజకవర్గాల వారీగా మోడల్ పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేయాల్సి ఉందని ఎన్నికల విభాగం తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు తెలిపారు.

# కూడితే వచ్చేదెంత.. తీసేస్తే పోయేదెంత!

వరంగల్ : ఎన్నికల శంఖారావం మోగడంతో ఉమ్మడి వరంగల్‌లో రాజకీయాలు అనూహ్య మలుపులు తిరుగుతున్నాయి. ఎప్పుడేం జరుగుతుందోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. కూడికలు తీసివేతలు అన్నట్లుగా పార్టీల కసరత్తు సాగుతోంది.

కారు ప్రచార జోరు అధికార పార్టీ అభ్యర్థులంతా ఖరారు కావడంతో ఇప్పటికే ప్రచారం జోరుగా చేస్తున్నారు. ఇటీవల మంత్రి కేటీఆర్ వరంగల్ తూర్పు, పశ్చిమ, వర్ధనపేట, భూపాలపల్లి, పరకాల, పాలకుర్తి నియోజకవర్గాల్లో పర్యటించారు. ఈ నెల 16న జనగామలో జరిగే సీఎం సభ కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాల్లో పలు నియోజకవర్గాల్లో కేసీఆర్ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొననున్నారు.

కమలంలోనూ పోటాపోటీ

ఉమ్మడి వరంగల్‌లోని 12 నియోజకవర్గాల్లో భారతీయ జనతా పార్టీ టికెట్ కోసం పెద్ద సంఖ్యలో ఆశావహుఖి పోటీ పడుతున్నారు. వరంగల్ పశ్చిమలో జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, అధికార ప్రతినిధి రాకేశ్‌రెడ్డి ఎవరికి వారు టికెట్టు తమదేననే ధీమాతో ఉన్నారు. సర్వేల ఆధారంగా పార్టీ తనకే అవకాశం ఇస్తుందని రాకేశ్‌రెడ్డి జోరుగా ప్రచారం చేస్తున్నారు.వరంగల్ తూర్పు నుంచి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వర్ధన్నపేట నుంచి మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి మాజీ మంత్రి గుండె విజయరామారావు, భూపాలపల్లి నుంచి కీర్తిరెడ్డి, నర్సంపేట నుంచి రేవూరి ప్రకాశ్‌రెడ్డి, డోర్నకల్ నుంచి లక్ష్మణ్‌నాయక్, జనగామ నుంచి దశమంతరెడ్డి పేర్లే ప్రకటిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

పరకాల బరిలో ముగ్గురు పోటీ పడుతున్నారు. డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, కొత్తగా పార్టీలో చేరిన డాక్టర్ కాళీప్రసాద్‌తోపాటు సంతోష్ పోటీకి ఆసక్తి చూపుతున్నారు.

ములుగు నుంచి సైతం పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ప్రహ్లాద్ ఇటీవల పార్టీలో చేరారు. తాటికృష్ణ, కృష్ణవేణినాయక్, రాజు నాయక్, జవహర్‌లాల్, ఉత్తమ్‌కుమార్ తదితరులు ఉన్నారు. మహబూబాబాద్ నుంచి హుస్సేన్ నాయక్‌తోపాటు యాప సీతయ్య టికెట్టు కోరుతున్నారు. హుస్సేన్‌నాయక్ ఇప్పటికే ప్రచారం ప్రారంభిం చారు. పాలకుర్తి నుంచి పెదగాని సోమయ్య, లేగ రామ్మోహన్‌రెడ్డి, కర్రా శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డిల పేర్లు తెరపైకి వస్తున్నాయి.

పొన్నాల దారి ఎటు?

టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం సంచలనంగా మారింది. జనగామ టికెట్టు ఆశించి భంగపడ్డ ఆయన తదుపరి రాజకీయ భవితవ్యం ఏమిటనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఆయన భారాసలో చేరుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే ఆ పార్టీ జనగామ టికెట్టు పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఖరారైన విషయం తెలిసిందే. భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామంటే పొన్నాల సంతృప్తి చెంది కారులో ప్రయాణిస్తారా లేక మరో దారి చూసుకుంటారా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇక జనగామ కాంగ్రెస్ టికెట్ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి దక్కడం దాదాపు ఖాయమైనట్టే.

కాంగ్రెస్‌లో అనూహ్య మార్పులు..

కాంగ్రెస్ పార్టీ త్వరలో అభ్యర్థుల జాబితాను ప్రకటించనుంది. ఈసారి తీవ్ర పోటీ నెలకొనడంతో ఆశావహులు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో గురువారం హస్తం తీర్థం పుచ్చుకున్న గాజర్ల అశోక్‌కు పరకాల నుంచి పార్టీ అవకాశం కల్పిస్తుందనే ప్రచారం జరుగుతోంది. ఈ స్థానం నుంచి మాజీ ఎమ్మెల్సీ కొండామురళి, ఇనగాల వెంకట్రామిరెడ్డి సైతం పోటీకి ఆసక్తి చూపుతున్నారు. వరంగల్ పశ్చిమలో సీనియర్ నాయకుడు జంగారాఘవరెడ్డి, హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఎవరికివారు టికెట్టు తమదేననే ధీమాతో ఉన్నారు. గత ఎన్నికల్లో పాలకుర్తి నుంచి బరిలో నిలిచి ఎర్రబెల్లికి పోటీ ఇచ్చిన జంగా ఈసారి తన అదృష్టాన్ని పశ్చిమ నుంచే పరీక్షించుకోవాలని పట్టుపడుతున్నారు. ఒకవేళ అవకాశం రాకపోతే బీఎస్పీ నుంచి బరిలో ఉంటారనే ప్రచారం జరుగుతోంది.పాలకుర్తి స్థానం నుంచి ప్రధానంగా ముగ్గురి పేర్లు వినిపిస్తున్నాయి. ఇటీవల అమెరికా నుంచి వచ్చిన హనుమాండ్ల ఝాన్సిరెడ్డితోపాటు, ఎర్రంరెడ్డి తిరుపతి రెడ్డి టికెట్లను ఆశిస్తున్నారు. మరో అభ్యర్థి డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ సైతం పోటీ చేసేందుకు సై అంటున్నారు. ఝాన్సిరెడ్డి పౌరసత్వంపై సందిగ్ధం నెలకొన్నట్టు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది.వర్ధన్నపేట నుంచి విశ్రాంత పోలీసు అధికారి నాగరాజు పేరు బలంగా వినిపిస్తోంది. ఈ స్థానం నుంచి నమిండ్ల శ్రీనివాస్, పరంజ్యోతి సైతం గట్టిగా ప్రయత్ని స్తున్నారు.మహబూబాబాద్ స్థానం నుంచి డాక్టర్ మురళినాయక్, మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్ పేర్లు వినిపిస్తున్నాయి. డోర్నకల్ నుంచి రాంచంద్రనాయక్, నెహ్రూనాయక్‌లు పోటీ పడుతున్నారు.ములుగు నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సీతక్క, వరంగల్ తూర్పు నుంచి కొండా సురేఖ, నర్సంపేట నుంచి మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి సింగాపురం ఇందిర, భూపాలపల్లి నుంచి గండ్ర సత్యనారాయణరావుకు టికెట్టు దాదాపు ఖరారైనట్టు సమాచారం.

# ఆరుగాలం శ్రమ దళారుల పాలు

సిరిసిల్ల : మరో నెల రోజుల్లో పత్తి పంట చేతికందనుండగా అందుబాటులో మార్కెట్ లేకపోవడంతో ధర్మారం ప్రాంత రైతులకు ఇబ్బందులు తప్పేలా లేవు. స్థానిక వ్యవసాయ మార్కెట్లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా 2015లో ధర్మకాంట ఏర్పాటు చేశారు. విద్యుత్తు తీగలు భూమిలో నుంచి వేశారు. కానీ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు. దీంతో ఏటా 5 కిలోమీటర్ల దూరంలోని ఎండపల్లి మండలం కొత్తపేట జిన్నింగు మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లేవారు. జిల్లాల పునర్విభజన అనంతరం కొత్తపేట జగిత్యాల జిల్లా పరిధిలో ఉన్నందున ధర్మారం మండల రైతులు పెద్దపల్లిలోని సీసీఐ కొనుగోలు కేంద్రానికి వెళ్లాలని అధికారులు సూచించారు. గతేడాది నుంచి కొత్తపేట మిల్లుల నిర్వాహకులు ధర్మారం రైతుల పత్తిని అనుమతించడం లేదు. దీంతో పెద్దపల్లికి వెళ్లలేక రైతులు స్థానికంగానే ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయిస్తూ నష్టపోతున్నారు. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఈ ఏడాది మండలంలో 2,618 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. జూలపల్లి, పాలకుర్తి, గొల్లపల్లి మండలాల్లోని పలు గ్రామాలు ధర్మారానికి సమీపంలో ఉండటంతో రైతులు ఎరువులు, పురుగుమందులు ఇతరత్రా అవసరాలకు ఇక్కడికే వస్తుంటారు. మండలకేంద్రంలోని వ్యవసాయం మార్కెట్లో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే ధర్మారంతో పాటు పరిసర మండలాల రైతులకు సౌకర్యంగా ఉంటుంది. కేంద్రం ఏర్పాటు చేసే వరకు పొరుగునే ఉన్న జగిత్యాల జిల్లా కొత్తపేట సీసీఐ కేంద్రంలో విక్రయించుకునే వెసులుబాటు కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై ధర్మారం వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి సరోజను సంప్రదించగా మండలంలో పత్తి సాగు ఎక్కువగా లేనందున కొనుగోలు కేంద్రం ఏర్పాటు సాధ్యం కాదని తెలిపారు.

# సిద్ధమవుతున్న ఖరీఫ్ ప్రణాళిక

అశ్వాపురం : జిల్లాలో వర్షాకాలం సాగుకు సంబంధించిన ఖరీఫ్ ప్రణాళిక సిద్ధమవుతోంది. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు పర్యటిస్తూ సాగు అంచనా విస్తీర్ణం సిద్ధం చేస్తున్నారు. ఏటా మృగశిరలో ఖరీఫ్ సాగు ప్రారంభమవుతుంది. ఈలోగానే ప్రణాళికను సిద్ధం చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో సిద్ధం కావచ్చని భావిస్తున్నారు. జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న సహా అన్ని పంటలు కలిపి దాదాపు 4.52 లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉన్నట్లు ప్రాథమిక అంచనా. గతేడాదితో పోలిస్తే ఈసారి ఖరీఫ్‌లో అన్ని పంటల విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నట్లు భావిస్తున్నారు. వరి వెయ్యి ఎకరాలు, పత్తి 10,400, కంది 5 వేలు, ఆయిల్‌పాం 1,300 ఎకరాల విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. వరి ఉత్పత్తి అధికంగా ఉండటం, సేకరణలో సమస్యలు, జిల్లాలో మిల్లర్ల సామర్థ్యం తక్కువగా ఉన్న నేపథ్యంలో గతేడాది ఖరీఫ్‌లో ఈ సాగును



తగ్గించేందుకు ప్రయత్నం చేశారు. పత్తి సాగును 20 శాతం పెంచడానికి ప్రయత్నించారు. అపరాలు, నూనె గింజల సాగుకు పెద్దపీట వేశారు. అధికారుల ప్రయత్నాలు కొంత ఫలించాయి. జిల్లాలో పత్తి విస్తీర్ణం సహా అపరాలు, నూనె గింజల సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. ఈ ఏడాది కూడా అదే ఒరవడిని కొనసాగించనున్నారు. ఇవికాక జిల్లాలో కూరగాయలు 2,597, మామిడి 7,600, జీడిమామిడి 8,541, పండ్లతోటలు 1,847, ఇతర ఆగ్రో రకాలు 20,895 ఎకరాల్లో సాగవుతున్నాయి. వీటి సాగుకు సంబంధించిన ప్రణాళికలనూ రూపొందించే ప్రయత్నాల్లో ఉన్నారు.

40వేల క్వింటాళ్లకుపైగా.. వర్షాకాలం ఎక్కడా లోపం లేకుండా విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు అధికారులు యత్నిస్తున్నారు. పప్పుధాన్యాలు, నూనె గింజల సాగుపై రైతుల్లో అవగాహన కల్పించాలని భావిస్తున్నారు. మరోవైపు పత్తి విత్తనాలు మినహా మిగిలినవన్నీ రాయితీపై సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 40 వేల క్వింటాళ్లకు పైగా విత్తనాలు అవసరమవుతాయని అంచనా. "జిల్లాలో ఖరీఫ్ సాగు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు కృషి చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో ప్రణాళిక సిద్ధమయ్యే అవకాశం ఉంది."– కె. అభిమన్యుడు, జిల్లా వ్యవసాయ అధికారి

# గ్రానైట్ అక్రమాల గుట్టు తేలేనా..?

కరీంనగర్ : గ్రానైట్ వ్యవహారంలోని డొల్లతనాన్ని బయటపెట్టేలా క్షేత్రస్థాయి విచారణకు ఉమ్మడి జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. గత నెలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు గ్రానైట్ క్వారీలు పర్యావరణానికి విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నాయనేలా జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) కన్నెర్ర చేయడంతోపాటు కొందరికి నోటీసులు జారీ చేయడంతో అధికారులు అప్రమత్తమవుతున్నారు. వ్యాపారాన్ని సాగించే పలు కంపెనీలు ఫెమా (ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్) నిబంధనల్ని ఉల్లంఘించాయనే విషయమై గత కొన్నాళ్లుగా కొనసాగుతున్న ఫిర్యాదులకు స్పందించిన న్యాయస్థానం సమగ్ర విచారణను చేపట్టాలని ఆదేశించింది. దీంతో ఈ నెల 10న కలెక్టర్ పర్యవేక్షణలో కరీంనగర్ జిల్లాధికారులు అత్యవసర సమీక్ష నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు విచారణను చేపట్టేందుకు ఆయా శాఖలతో కూడిన కమిటీని ఏర్పాటు చేయబోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 320 క్వారీల వద్ద ఉన్న వాస్తవ పరిస్థితుల్ని వీరు గమనించనున్నారు. కాలుష్య నియంత్రణ మండలి, జలవనరుల శాఖ, మైనింగ్, పోలీసు, రెవెన్యూ విభాగాలకు చెందిన కీలకమైన అధికారులను విచారణ సభ్యులుగా నియమించనున్నారు. ఈ నెల 19వ తేదీ లోగా సమగ్రమైన నివేదికను అందించేలా జిల్లా అధికారులు సమాయత్తమవుతున్నారు.

నిజాల నిగ్గు తేలేనా..?

గనుల ఖిల్లాగా మారిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సహజ వనరులను ఇష్టానుసారంగా దోపిడీ చేస్తున్నారనేలా తరచూ ఎవరో ఒకరు రాష్ట్ర, కేంద్రస్థాయిలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదులను అందిస్తున్నారు. ముఖ్యంగా 2013లో విజిలెన్స్ అధికారులు చేసిన తనిఖీల్లో గుర్తించిన అక్రమాల విషయంలో ప్రభుత్వానికి రావాల్సిన ఫెనాల్టీని ఎగవేశారంటూ హైదరాబాద్‌కు చెందిన పేరాల శేఖర్‌రావు గతేడాది నవంబరులో సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఆయా గ్రానైట్ సంస్థలు రూ.124.94 కోట్ల జరిమానాను ఐదింతలుగా రూ.749 కోట్లు చెల్లించలేదని, పైగా నిబంధనలకు విరుద్ధంగా పర్యావరణ దోపిడీ జరుగుతుందని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. గతంలోనూ జిల్లాకు చెందిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, వైఎస్సార్‌టీపీ నాయకుడు సింగిరెడ్డి భాస్కర్‌రెడ్డి, న్యాయవాది భేతి మహేందర్‌రెడ్డిలు కూడా గ్రానైట్ వ్యాపారంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరారు. వరుస ఫిర్యాదులతో స్పందించిన ఉన్నతాధికారులు, ఎన్‌జీటీలు ఉమ్మడి జిల్లాలోని ఖనిజ సంపద కొల్లగొడుతున్న విషయమై తగిన దృష్టిని సారించాయి. అనుమతి ఇచ్చిన క్వారీలలో ఇష్టానుసారంగా పేలుళ్లకు పాల్పడుతూ సమీపంలోని రైతులు, గ్రామాల ప్రజలకు నష్టం కలిగేలా చేస్తున్నారనే విషయమై విచారణ అధికారులు సమగ్రంగా పరిశీలనల్ని జరపనున్నారు. ఎప్పటికప్పుడు ఆయా క్వారీల్లో జరుగుతున్న మోసాలు, అక్రమాలపై జల్లా యంత్రాంగం అనుకున్న విధంగా స్పందించిన దాఖలాలు లేవు. కనీసం త్వరలో చేపట్టే విచారణనైనా పక్కాగా నిర్వహిస్తూ నిజాల నిగ్గును తేలిస్తే బాగుంటుందనే భావనను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అతిక్రమించిన నిబంధనలపై పక్కాగా వ్యవహరించడంతోపాటు లీజుల వ్యవహారాలు, ఇష్టానుసారంగా జరిగిన తవ్వకాలు, రాయి అమ్మకాలపై పూర్తిస్థాయి వివరాల్ని సేకరించాల్సిన అవసరముంది. మరి మన అధికారులు ఏమేరకు చొరవ చూపిస్తూ ఎలాంటి విచారణ సాగిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

# పదోన్నతులకు 'ముందస్తు' జాబితాలు



ఆదిలాబాద్ : ఉపాధ్యాయ పదోన్నతుల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండేలా విద్యాశాఖ అప్పుడే ముందస్తు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా కేటగిరీల వారీగా ఉపాధ్యాయుల జాబితాలను తయారుచేసింది. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11లోగా తెలపాలని కార్యాలయ వర్గాలు సంఘాల వాట్సాప్ గ్రూపులకు జాబితాలను పంపడం కౌన్సెలింగ్ ప్రక్రియ సాఫీగా సాగేలా జాగ్రత్తలు తీసుకుంటోంది. విద్యాశాఖ పరిధిలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ)లకు పదోన్నతి కల్పించే వెసులుబాటు ఉండటంతో.. ఆ మేరకు అధికారులు ముందస్తు కసరత్తులో నిమగ్నమయ్యారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు 205 ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 33, స్థానికసంస్థలు యాజమాన్య పరిధిలో 172 ఖాళీలు ఉన్నట్లుగా తేల్చారు. ఇందుకోసం ఒక్కో కేటగిరిలో ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులను గుర్తిస్తూ పదోన్నతికి అర్హులైన జాబితాలను తయారుచేశారు. ఆయా జాబితాల్లో మొత్తం 603 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు అర్హులుగా తేల్చి జాబితాలో చోటు కల్పించారు. పీఎస్‌హెచ్‌ఎంల పదోన్నతి కోసం 1986 నుంచి 2002 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు చోటు దక్కగా.. మిగిలిన స్కూల్ అసిస్టెంట్ల జాబితాలో 1989 నుంచి 2002 సంవత్సర డీఎస్సీ ఉపాధ్యాయులు ఉన్నారు.

కొన్నింటికి అర్హులు లేరట

మరాఠీ మాధ్యమంలో స్థానిక సంస్థల యాజమాన్య పరిధిలో స్కూల్ అసిస్టెంట్ గణితం, ఫిజిక్స్, ఉర్దూ మాధ్యమం ప్రభుత్వ యాజమాన్య పరిధిలో స్కూల్‌అసిస్టెంట్ సోషల్ స్టడీస్‌లో ఖాళీలు ఉన్నా అర్హులైన ఉపాధ్యాయులు లేనట్లుగా జాబితాల్లో విద్యాశాఖ పొందుపర్చింది. మొత్తం ఆయా సబ్జెక్టుల్లో నాలుగు పోస్టులకు అర్హులైన వారు లేకపోవడంతో అవి అలాగే మిగిలిపోనున్నాయి. గోప్యంగా కసరత్తు.. అధికారికంగా ఇంకా షెడ్యూల్ విడుదల కానందున విద్యాశాఖ లోలోన కసరత్తు చేస్తోంది. గోప్యంగా వివరాలను ఉపాధ్యాయ సంఘాల వాట్సాప్ గ్రూప్‌లకు పంపించడం విమర్శలకు తావిస్తోంది. అందరికి తెలిసేలా కసరత్తు చేస్తే ప్రతి ఉపాధ్యాయుడికి సమాచారం చేరుతుందనే భావన వ్యక్తమవుతోంది. పదోన్నతి ఖాళీలు ఇవే.. తెలుగు, హిందీ, మరాఠీ, ఉర్దూ మాధ్యమాలు కలిపి 50 కేటగిరీలకు కలిపి సబ్జెక్టుల వారీగా పదోన్నతి ఖాళీలు యాజమాన్యాల వారీగా ఇలా ఉన్నాయి. ఈ ఖాళీలకు ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులతో జాబితాలు తయారుచేశారు.

# మళ్లీ తెరపైకి 'ప్రైవేటు పంచాయితీ



ఆసిఫాబాద్ : గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించే అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఇందుకు గ్రామ పంచాయతీ సర్పంచుల నుంచి తీర్మానాలు పంపించాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ నుంచి జిల్లా పంచాయతీ అధికారులకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల క్రితం ఇలాంటి ఆదేశాలు జారీ కావడంతో జిల్లాలో 335 జీపీలకు గాను సుమారు 320 కిపైగా జీపీల్లో తీర్మానాలు తీసుకొని పంపించారు. తీర్మానాలు ఇచ్చినా.. ఈ విధానాన్ని చాలా పంచాయతీల్లో తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ప్రభుత్వం ఈ అంశంపై వెనక్కి తగ్గింది. మూడురోజుల క్రితం తీర్మానాలు పంపించాలని మళ్లీ ఉత్తర్వులు జారీ కావడం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ బాధ్యతను పంచాయతీలే చూస్తాయి. చాలా పంచాయతీల్లో సిబ్బంది కొరత, ఫిలమెంట్ బల్బుల ఏర్పాటుతో విద్యుత్తు వినియోగం పెరిగి బిల్లుల మోత మోగడం, సరైన ఆన్/ఆఫ్ వ్యవస్థ లేక నిరంతరం వెలుగుతున్న బల్బులతో విద్యుత్తు దుబారా కావడం, తరచూ కాలిపోవడం, వీటి కొనుగోళ్లలో అక్రమాలకు దారితీయడం తదితర సమస్యలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో ఎలాంటి వృథాకు తావులేకుండా విద్యుత్తు ఆదా కోసం ఫిలమెంట్ బల్బుల స్థానంలో ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణ కోసం ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సంస్థకు బాధ్యతలు అప్పగించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు గ్రామ పంచాయతీల నుంచి తొలుత ఈ నెల5 తర్వాత 7 లోపే తీర్మానాలు పంపాలని పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ తాజాగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారులు అన్ని జీపీల కార్యదర్శులకు విషయాన్ని తెలియజేసి సర్పంచుల ద్వారా తీర్మానాలు పంపించాలని ఆదేశించారు. ఇంకాచాలా చోట్ల రావాల్సి ఉంది.

సంస్థ నిర్వహణ ఇలా.. గ్రామాల్లో విద్యుత్తు స్తంభాల సంఖ్యకు అనుగుణంగా ఎల్‌ఈడీ దీపాలు, వాటి అమరికకు అవసరమైయ్యే పరికరాలు ఇతర సామగ్రిని సంస్థే సరఫరా చేస్తూ నిర్వహణ చూడనుంది. ఇందుకోసం జిల్లా స్థాయిలో జిల్లా పంచాయతీ అధికారి ఈఎస్‌సీఆర్‌ఓడబ్ల్యూ ఖాతా తెరవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సామగ్రి, నిర్వహణ ఖర్చులను సంబంధిత పంచాయతీల నుంచి నెలనెలా జిల్లా పంచాయతీ అధికారి సేకరించి సంస్థ ఖాతాకు జమచేయాలి. ఏదైనా పంచాయతీ డబ్బులు చెల్లించకుంటే.. నెలనెలా ప్రభుత్వం పంచాయతీలకు ఇచ్చే నిధులు, సాధారణ కేటాయింపుల నుంచి కోత విధించి సంస్థ ఖాతాలో చెల్లించేలా డీపీవోలకు అధికారం ఇచ్చారు. బిల్లుల భారం తగ్గించేందుకు ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటు నిర్ణయం బాగున్నా.. వాటి నిర్వహణ బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించడంపై కొందరు సర్పంచులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రమేయం లేకుండానే అధికారులే నేరుగా కోత విధించి సంస్థ ఖాతాలో జమచేయడంతో నిధుల నియంత్రణను కోల్పోవాల్సి వస్తుందని వాపోతున్నారు. గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు కోసం ప్రజలు కార్యదర్శులు, సర్పంచులను సంప్రదిస్తారు. నిర్వహణను ప్రైవేటు సంస్థకు అప్పగిస్తే తమ ఉనికి దెబ్బతింటుందని మరికొందరు ఆందోళన చెందుతున్నారు.

కమిషనర్ కార్యాలయానికి పంపిస్తాంరవికృష్ణ, డీపీఓ


ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని జీపీల్లో సర్పంచుల ద్వారా తీర్మానాలు చేసి పంపించాలని కార్యదర్శులకు సూచించాం. అవి వచ్చిన వెంటనే కమిషనర్ కార్యాలయానికి నివేదికలు పంపిస్తాం.

# నిధుల జాడలేదు.. గండ్లు పూడ్చలేదు..

భైంసా : వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని వివిధ చెరువులకు భారీ నష్టం వాటిల్లింది. కొన్ని చెరువు కట్టలకు గండ్లుపడగా మరి కొన్నింటికి తూములు, అలుగులు, కాల్వలు దెబ్బతిన్నాయి. వాటి కింద పంట పొలాలు బీళ్లుగా మారాయి. నష్టం జరిగి ఎనిమిది నెలలు అవుతోంది. మరమ్మతుల కోసం నీటిపారుదలశాఖ అధికారులు నివేదికలు రూపొందించి నిధుల కోసం ప్రతిపాదించారు. ప్రభుత్వం నేటికీ నిధులు మంజూరు చేయకపోవడం గమనార్హం. పైగా చెరువులకు వచ్చిన నీరు వచ్చినట్లే వృథా అవుతోంది. గత వర్షాకాలంలో జరిగిన పంట నష్టానికి ప్రభుత్వం నేటికీ రూపాయి పరిహారం ఇవ్వలేదు. కట్టకు దిగువన ఉన్న ఆయకట్టు పొలాలు కోతకు గురై పూడ్చుకోలేని నష్టం వాటిల్లుతుందని భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయక, అధికారులు మరమ్మతులు చేపట్టకపోతే వచ్చే వర్షాకాలంలో తాము సాగు చేసిన పంటలకు మరోసారి వరదనష్టం జరిగి చేసిన కష్టం, పెట్టిన పెట్టుబడి అంతా బూడిదలో పోసిన పన్నీరవుతుందంటున్నారు. పలు చెరువులపై ఆధారపడిన మత్స్యకారులకు ఉపాధి కరవు అవుతుంది. ఆ ప్రాంతంలోని నీరు వృథా వర్షాకాలంలో పెంపొందే భూగర్భజల మట్టానికి విఘాతం ఏర్పడి పరిసరాల్లోని బోరుబావులు భవిష్యత్తులో వట్టిపోయే ప్రమాదం పొంచి ఉంటుంది.

అత్యవసర నిధులతో..

ఇది ఇలా ఉంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా స్థాయిలో నీటిపారుదలశాఖ సీఈ, ఎస్ఈ, ఈఈ అత్యవసర నిధుల నుంచి జిల్లా వాటాగా వచ్చిన రూ.66.27లక్షల నిధులతో 29 పనులను తాత్కాలికంగా పూర్తిచేసినట్లు నీటిపారుదలశాఖ అధికారుల చెబుతున్నారు. ప్రభుత్వం ప్రతిపాదిత నిధులు ఇవ్వకపోవడంతో



వాటికి శాశ్వత, ఇతర పనులకు పూర్తిస్థాయిలో ఎప్పుడు మర్మతులు చేపడతారనేది ప్రశ్నార్థకంగా మారింది.

నష్ట నివారణ చర్యలు

రామారావు, ఈఈ, జిల్లా నీటిపారుదలశాఖ, నిర్మల్

జిల్లాలో అత్యవసర నిధులతో కొన్ని చెరువులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాం. భారీ వర్షాలకు చెరువుల కింద జరిగిన నష్టానికి మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదించ్చాం. నిధులు రావాల్సి ఉంది. మంజూరు కాగానే పూర్తిస్థాయి పనులను చేపడతాం.

జిల్లాలో చెరువులు : 791

ఆయకట్టు : 53వేల ఎకరాలు

వర్షాలకు దెబ్బతిన్నవి : 125

మరమ్మతుల కోసం ప్రతిపాదించిన నిధులు : రూ.10 కోట్లు

# కేంద్రాల ప్రారంభం సరే... తూకాలేవి?

రుద్రంగి : రుద్రంగి మండల వ్యాప్తంగా ఇరవై రోజుల క్రితం యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే ధాన్యంతో మార్కెట్ యార్డు నిండిపోయింది. మరోవైపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన అధికారులు తూకాలు ప్రారంభించలేదు. ఆకాశంలో కమ్ముకుంటున్న మబ్బులు, కురుస్తున్న చిరుజల్లులు ధాన్యం ఆరబోసిన రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కేంద్రాలకు తీసుకువచ్చి పదిహేను నుంచి ఇరవై రోజులు గడుస్తున్నా తూకం వేయకపోవడంతో అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారు. గత సంవత్సరం యాసంగిలో మండలంలో సుమారు 3,500 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా సుమారు 1.5 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ యాసంగిలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు



చేసేది లేదని ప్రకటించటంతో సాగు విస్తీర్ణం తగ్గింది. ఈ ఏడాది యాసంగిలో కేవలం 2400 ఎకరాలకే పరిమితమైంది. గత ఏడాది ఏప్రిల్ చివరి వారంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగా జూన్ చివరి వారం వరకు కొనసాగింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తొందరగా కొనుగోళ్లను చేపడితేనే జూన్ మొదటి వారం వరకు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. లేదంటే జూన్ చివరి వరకు కొనుగోళ్ల ప్రక్రియ సాగే అవకాశం ఉంటుంది. ఈ యాసంగిలో మండల వ్యాప్తంగా సుమారు 70 నుంచి 80 వేల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా.

వీటిపై దృష్టిసారిస్తే మేలు ధాన్యం తూర్పార పట్టడానికి అవసరమైన యంత్రాలు అందుబాటులో ఉంచాలి. ధాన్యం మిల్లులకు చేరుకున్న తర్వాత తరుగు పేరిట అదనంగా కోత విధించకుండా చూడాలి. లారీలు, గన్నీ సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి. కొనుగోలు కేంద్రాల్లో విద్యుద్దీకరణ, తాగు నీరు, నీడ వసతులు ఏర్పాటు చేయాలి. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే రైతులకు అందిస్తే బాగుంటుంది.

తొందరగా కొనుగోళ్లు చేపట్టాలి : – ఇప్ప మహేశ్, రైతు, రుద్రంగి

నాకున్న నాలుగు ఎకరాల్లో సుమారు 120 క్వింటాళ్ల వరకు ధాన్యం పండించాను. ఆకాశంలో నిత్యం మేఘాలు ఏర్పతున్నందున ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించి వెంటనే తూకాలు వేయాలి. కాంటాలను పూర్తి చేసిన బస్తాలను జాప్యం చేయకుండా మిల్లులకు పంపిస్తేనే తర్వాత ధాన్యం తీసుకు వచ్చే రైతులకు స్థలం దొరుకుతుంది. గతంలో బస్తాలను మిల్లులకు పంపడంలో జాప్యం జరగటం వల్ల బస్తాలు కూడా తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

15 రోజుల కిందట తీసుకొచ్చాను : – లావుడ్య రవి, రైతు, రుద్రంగి

నాకు ఉన్న ఐదు ఎకరాలతో పాటు మరో 12 ఎకరాలను కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. పదిహేను రోజుల క్రితం ధాన్యాన్ని మార్కెట్ యార్డుకు తీసుకువచ్చాను. సుమారు 500 క్వింటాళ్ల ధాన్యాన్ని ఆరబెట్టుకోవటానికి నిత్యం 5 కి.మీ.ల దూరంలో ఉన్న కుక్కలగండి తండా నుంచి కుటుంబ సభ్యులతో కలిసి నిత్యం మార్కెట్ యార్డుకు వచ్చి ఆరబెట్టడం, మేఘాలను చూసి మళ్లీ కుప్పలు చేయాల్సి వస్తోంది.

మూడు, నాలుగు రోజుల్లో ప్రారంభిస్తాం : –శ్రీనివాసరావు, ఏఎంసీ ఛైర్మన్, రుద్రంగి

మూడు, నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తాం. సనుగుల ప్యాక్స్, రుద్రంగి ఏఎంసీలకు కేటాయించిన రైస్ మిల్లుల్లో ఎఫ్‌సీఐ తనిఖీలు జరుగుతున్నాయి. తనిఖీల ప్రక్రియ ముగిసిన తర్వాత కొనుగోళ్లను చేపడతాం.


# హద్దులు చెరిపేసి... ఆక్రమణలకు తెరతీసి...

సిరిసిల్ల : రాజరాజేశ్వర జలాశయం నిర్వాసితులకు ప్రభుత్వం పంపిణీ చేయగా మిగులు స్థలాల రక్షణను పూర్తిగా విస్మరించారు. అవి ఆక్రమణల పాలవుతున్నా వాటిని కాపాడే ప్రయత్నం చేయకపోవడం విచారకరం. నిర్వాసితులు పొందిన ప్లాట్లు, అందులో నిర్మించుకున్న ఇళ్ల నిర్మాణాల క్రయ, విక్రయాలకు అనుమతులిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఇవి అమల్లోకి రావడానికి ఇంకా సమయం పడుతుంది. ఈ లోపు కాలనీల్లో పలుకుబడి కలిగిన వారు హద్దులు చెరిపేసి ఆక్రమణల పర్వానికి తెరతీశారు. రాజరాజేశ్వర జలాశయం నిర్మాణంలో బోయినపల్లి, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల పరిధిలోని 12 గ్రామాల్లో 11,731 మంది నిర్వాసితులను ప్రభుత్వం గుర్తించింది. వీరికి నివాస స్థలాలకు వేములవాడ, బోయినపల్లి, తంగళ్లపల్లి మండలాల పరిధిలో 11 కాలనీలకు 1,171.18 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను సేకరించారు. వీటిలో ఒక్కో నిర్వాసితునికి 242 చదరపు గజాల స్థలాన్ని పట్టాగా అందజేశారు. వీటితోపాటు పంచాయతీ, ఇతర ప్రభుత్వ భవనాలు, మౌలిక వసతులను కల్పించారు. కాగా చాలా కాలనీల్లో నిర్వాసితులకు పంపిణీ చేయగా మిగులు ప్లాట్లు, మరికొన్ని చోట్ల ప్లాట్లుగా చేయని ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో ఇవి అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. నీలోజిపల్లి, కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీల చుట్టూ హద్దులు సుమారు ఐదెకరాల పైనే ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఆక్రమణలకు గురయ్యాయి. ఇటీవల కాలనీవాసులు ఆక్రమణలను గుర్తించి ఫిర్యాదు చేయడంతో నిర్మాణాలను అడ్డుకున్నారు. కానీ ఇప్పటికీ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. అలాగే వేములవాడ మండలం పరిధిలోని రుద్రవరం, అనుపురం, కొడుముంజ కాలనీల సమీపంలో ప్రైవేటు వెంచర్లతో రిజిస్ట్రేషన్లు జరిగాయి. రెవెన్యూ అధికారులకు తెలిసినా వీటిని నిలువరించలేదు. ఇప్పటికీ చాలా కాలనీల్లో హద్దులు లేవు.

చర్యలు తీసుకుంటాం : – శ్రీనివాసరావు, ఆర్డీవో, సిరిసిల్ల

ఖాళీ ప్లాట్ల ఆక్రమణలు, కబ్జాలు ఆయా మండలాల పరిధిలోని రెవెన్యూశాఖ దృష్టిలో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ల అనుమతులకు ముందే పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలించి కాలనీల చుట్టూ హద్దులు ఏర్పాటుపై పరిశీలిస్తాం.

హద్దులు ఏర్పాటు చేస్తేనే... నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్ల క్రయ, విక్రయాలకు గత నెల రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పట్టాలు పొంది, ఇళ్ల నిర్మాణం చేసుకున్నవారికి అవకాశం ఉంటుంది. నిర్వాసితులకు కేటాయించక ఖాళీగా ఉన్న ప్లాట్లు పూర్తిగా రెవెన్యూ ఆధీనంలోనే ఉంటాయి. రిజిస్ట్రేషన్ శాఖకు ఉత్తర్వులు పంపించే క్రమంలో కాలనీల వారీగా ఖాళీ ప్లాట్ల వివరాలు రిజిస్ట్రేషన్లకు అనుమతి లేకుండా చర్యలు తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో ఖాళీ ప్లాట్ల వివరాలు తెలుపుతూ ఇవి ప్రభుత్వ ఆధీనంలోని అని బోర్డులను ఏర్పాటు చేయాలి. వేములవాడ, బోయినపల్లి మండలాల పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు సిరిసిల్ల–కరీంనగర్ రహదారిని ఆనుకుని ఉన్నాయి. ఇక్కడ గజం స్థలం వేలల్లో పలుకుతోంది.




## తన గన్‌మెన్‌లను సరెండర్ చేస్తున్నట్లు డీజీపీకి బాలినేని లేఖ

ప్రకాశం: ఒంగోలు పోలీసుల తీరుపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లాలో నకిలీ భూ దస్తావేజుల కేసులో పోలీసుల వ్యవహారశైలిపై బాలినేని ఆగ్రహంగా ఉన్నారు. పోలీసుల తీరుకు నిరసనగా గన్‌మెన్‌లను ప్రభుత్వానికి తక్షణమే సరెండర్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీకి బాలినేని లేఖ రాశారు. ఈ కేసులో ఉన్న ఎంతటి వారినైనా అరెస్టు చేయాల్సిందేనని పేర్కొన్నారు. ఈ కేసులో ఉన్నది అధికార పార్టీ నేతలనైనా వదిలిపెట్టవద్దన్నారు. అసలు దోషుల విషయంలో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని బాలినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి తీరును ఎప్పుడూ చూడలేదని ఆయన పేర్కొన్నారు. నాలుగేళ్ల నుంచే ఇలాంటి విచిత్ర పరిస్థితులు చూస్తున్నానంటూ ఆక్రోశం వ్యక్తం చేశారు. పోలీసులు తన సూచనను పెడచెవిన పెడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. తక్షణం తన గన్‌మెన్‌లను సరెండర్ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో తీవ్ర కలకలం రేపిన నకిలీ భూపత్రాల కేసులో ఇప్పటి వరకు 10 మంది అరెస్టు అయ్యారు. ఎంతటి వారినైనా వదిలిపెట్టవద్దని మూడు రోజుల క్రితం కలెక్టర్ సమక్షంలో బాలినేని శ్రీనివాసరెడ్డి ఎస్పీని కోరారు. ఈ కేసులో తన పక్కనున్న వారినైనా ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టవద్దన్నారు. పోలీసులు అనధికారికంగా కొన్ని పేర్లు చెబుతున్నారని బాలినేని పేర్కొన్నారు.




దిల్లీ: స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్టబద్ధత కల్పించే అంశంపై దాఖలైన పిటిషన్లపై దేశ సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. LGBTQIAం కమ్యూనిటీకి చెందిన వ్యక్తుల వివాహానికి సమానత్వ హక్కులు ఇచ్చేందుకు నిరాకరించింది. అయితే వారు సహజీవనంలో ఉండొచ్చని తెలిపింది. ఈ మేరకు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 3:2తో తీర్పు చెప్పింది. అయితే, స్వలింగ సంపర్క జంటలపై ఎలాంటి వివక్షా చూపించొద్దని, వారి హక్కులను కాపాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ అంశంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం 10 రోజులు పాటు సుదీర్ఘ విచారణ చేపట్టి.. మే 11న తన తీర్పును రిజర్వు చేసింది. తాజాగా తీర్పు వెలువరించింది. ఈ పిటిషన్లపై రాజ్యాంగ ధర్మాసనం.. నాలుగు వేర్వేరు తీర్పులు ఇచ్చింది. స్వలింగ సంపర్కులు పిల్లలను దత్తత తీసుకోవడం సహా కొన్ని అంశాలపై ధర్మాసనం ఏకాభిప్రాయానికి రాలేదు.

అయితే, స్వలింగ సంపర్కం అనేది కేవలం పట్టణాలు లేదా సమాజంలో ఉన్నత వర్గాలకు మాత్రమే పరిమితమైనదనే అపోహను వీడాలని ధర్మాసనం ఏకగ్రీవంగా పేర్కొంది.




భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష కాంగ్రెస్ హామీల వర్షం కురిపించింది. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని పేర్కొంది. ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్, ఐపీఎల్ జట్టు ఏర్పాటు సహా ఏర్పాటు సహా 59 హామీలిచ్చింది. ఈ మేరకు మంగళవారం 106 పేజీల ఎన్నికల మేనిఫెస్టోను మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు, రైతుల సహా అన్నివర్గాల ప్రజలు లబ్ధిపొందేలా మేనిఫెస్టోను రూపొందించినట్లు ఆయన తెలిపారు.

**రూ. 500కే గ్యాస్ సిలిండర్ :** అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యాస్ సిలిండర్‌ను కేవలం రూ.500కే అందజేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దీంతోపాటు రూ.2 లక్షల మేర రైతు రుణాలను మాఫీ చేస్తామని, అర్హులైన మహిళలకు ప్రతి నెలా రూ.1500 భృతి చెల్లిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొంది. రూ.10 లక్షల మేర ప్రమాద బీమా కూడా కల్పిస్తామని తెలిపింది. పాత పింఛన్ విధానాన్ని అమలు చేస్తామని, పాఠశాల విద్యను పూర్తి ఉచితంగా అందించడంతోపాటు, నిరుద్యోగ యువతకు వాళ్ల అర్హత ఆధారంగా నెలకు రూ.1,500 నుంచి రూ.3 వేల చొప్పున రెండేళ్లపాటు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చింది. మధ్యప్రదేశ్‌లో తొలివిడతగా 144 స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు, మాజీ సీఎం కమల్‌నాథ్‌ను ఈసారి కూడా ఛింద్వాడా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో దింపాలని పార్టీ నిర్ణయించింది. రాజ్యసభ సభ్యుడు దిగ్విజయ్‌సింగ్ తనయుడు జైవర్ధన్ సింగ్.. రాఘోగఢ్ నుంచి, సోదరుడు లక్ష్మణ్‌సింగ్.. చాచౌరా నుంచి పోటీ చేయనున్నారు. కమల్‌నాథ్ సర్కారులో జైవర్ధన్ మంత్రిగా సేవలందించారు. వీరిద్దరూ ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌పై నటుడు విక్రమ్ మస్తాల్ పోటీ చేయనున్నారు. 17 మంది మాజీ మంత్రులకు తొలి జాబితాలో స్థానం లభించింది. మొత్తం 39 మంది ఓబీసీలు, 22 మంది ఎస్సీలు, 30 మంది ఎస్టీలకు అవకాశం ఇచ్చారు. మైనారిటీల్లో ఆరుగురు, మహిళల్లో 19 మంది టికెట్లు పొందారు. 144 మందిలో 65 మంది యాభై ఏళ్ల లోపువారే. మొత్తం 230 అసెంబ్లీ స్థానాలున్న మధ్యప్రదేశ్‌లో నవంబర్ 17న పోలింగ్ జరగనుంది.




## నేడు ఇజ్రాయెల్‌లో బైడెన్ పర్యటన.. జోర్డాన్‌లో పలువురు దేశాధినేతలతోనూ సమావేశం

వాషింగ్టన్: హమాస్ దాడులతో దద్దరిల్లిన ఇజ్రాయెల్‌లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పర్యటించనున్నారు. బుధవారం ఆయన ఆ దేశ పర్యటనకు వెళ్లనున్నట్లు శ్వేతసౌధం సోమవారం ప్రకటించింది. అనంతరం ఆయన జోర్డాన్‌కూ వెళ్లనున్నట్లు తెలిపింది. అక్కడ ఈజిప్ట్, పాలస్తీనా, జోర్డాన్ దేశాధినేతలతో సమావేశం కానున్నట్లు తెలిపింది. హమాస్ క్రూరమైన తీవ్రవాద దాడిని ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్‌కు తన బలమైన మద్దతును ప్రదర్శించడమే బైడెన్ పర్యటన ప్రధాన ఉద్దేశమని శ్వేతసౌధం అధికారిక ప్రకటనలో పేర్కొంది. అలాగే తదుపరి చేపట్టాల్సిన చర్యలపైనా ఇజ్రాయెల్‌తో చర్చించనున్నట్లు వెల్లడించింది. అక్కడి నుంచి అధ్యక్షుడు జోర్డాన్ రాజధాని అమ్మన్‌కు వెళతారని తెలిపింది. అక్కడ జోర్డాన్ రాజు అబ్దుల్లా, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతే అల్– సిసీ, పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌తో సమావేశమవుతారని వెల్లడించింది. పాలస్తీనా ప్రజల గౌరవం, స్వీయనిర్ణయాధికారాన్ని హమాస్ ప్రతిబింబించదని బైడెన్ ఈ భేటీలో పునరుద్ఘాటించనున్నట్లు తెలిపింది. అలాగే గాజా లోని మానవతా సంక్షోభ నివారణ గురించీ చర్చిస్తారని పేర్కొంది.

## స్కిల్ కేసు.. చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ 19కి వాయిదా

అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో ఇవాళ విచారణ జరిగింది. తదుపరి విచారణను కోర్టు ఈ నెల 19కి వాయిదా వేసింది.


మరోవైపు చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై విజయవాడ ఏసీబీ కోర్టు విచారణ చేపట్టింది. చంద్రబాబు తరఫు లాయర్ల పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించింది.

**ఫైబర్‌నెట్ కేసులో విచారణ జరిగే వరకు చంద్రబాబును అరెస్టు చేయొద్దు** : ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది.కోర్టు విచారణ జరిగేవరకు అరెస్టు చేయవద్దన్న అభ్యర్థనను పొడిగించాలని చంద్రబాబు తరఫు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా కోరారు. దీంతో అప్పటివరకు



అరెస్టు చేయవద్దన్న అభ్యర్థనను అంగీకరించాలని సుప్రీంకోర్టు సూచించింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

## దసరాకు అన్నారు.. ఇప్పుడు డిసెంబర్ అంటూ జగన్ మడమతిప్పారు.. రఘురామ



దిల్లీ: విశాఖ కేంద్రంగా పాలన విషయంలో సీఎం జగన్ మాట మార్చి మడమ తిప్పారని వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజు విమర్శించారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు అనుకూలంగా తీర్పు వస్తుందని వైకాపా భయపడుతోందని.. అందుకే అకస్మాత్తుగా ఇప్పుడు మార్గదర్శి కేసును తెరపైకి తీసుకొచ్చారని అన్నారు. చంద్రబాబు కేసులో సుప్రీంకోర్టులో ఈరోజు వాదనలూ పూర్తయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. చంద్రబాబును ఇన్ని రోజులు జైలులో ఉంచడం బాధాకరమన్నారు. విశాఖపట్నం నుంచే పాలన విషయంలో సీఎం జగన్ మాట తప్పారని ప్రజలు భావిస్తున్నారని.. గతంలో దసరాకు వెళ్తామని చెప్పిన సీఎం ఇప్పుడు డిసెంబర్ అంటున్నారని విమర్శించారు. విశాఖలోని రిషి కొండను ధ్వంసం చేసి దాదాపు రూ.500కోట్లతో వివిధ రకాల భవనాల నిర్మాణాలు చేపడుతున్నారని రఘురామ తెలిపారు. టూరిజం కోసం నిర్మాణాలు చేపట్టామని ప్రభుత్వం చెబుతోందని.. టూరిజం కోసమైతే అంతపెద్ద నిర్మాణాలు ఎందుకు? అని ప్రశ్నించారు. సీఎం విశాఖకు మకాం మార్చినంత మాత్రాన సర్వీసు నిబంధనల ప్రకారం పాలనా అధిపతిగా ఉన్న సీఎస్, ఇతర కార్యదర్శులు శాశ్వతంగా వెళ్లే అవకాశం ఉండదన్నారు. మరోవైపు, ఏపీ అధికార పరిధిలో లేని అంశాలను తీసుకొచ్చి మార్గదర్శి విషయంలో ఏదోరకంగా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తలా తోక లేకుండా ఏవేవో కేసులు తీసుకొచ్చి మోపేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనికి తోడు, 'దున్నపోతు ఈనిందంటే దూడను కట్టేశాం సర్' అంటూ సీఎం జగన్ వద్దకు వచ్చి సెల్యూట్ చేసేలా కొందరు అధికారుల తీరు ఉందని రఘురామ ఆక్షేపించారు. సీఎం జగన్ తాడేపల్లిలో ఉన్నా జనాన్ని కలవరు.. అక్కడికి వెళ్లినా కలిసేది ఉండదు.. అందువల్ల సీఎం ఎక్కడ ఉన్నా పెద్ద ఉపయోగం ఏమీ ఉండదని విమర్శించారు.

## నన్ను కలవకూడదని చెప్పడానికి ఈ ప్రభుత్వానికి హక్కు ఎక్కడిది?: నారా భువనేశ్వరి




అమరావతి: చంద్రబాబుకు మద్దతుగా, రాజమహేంద్రవరంలో ఉన్న తనను కలిసి మనోధైర్యాన్ని ఇవ్వడానికి తెలుగుదేశం పార్టీ శ్రేణులు సంఘీభావ యాత్ర చేపడితే అందులో తప్పేముంది అని నారా భువనేశ్వరి పశ్నించారు. సంఘీభావం తెలిపేవారికి నోటీసులు ఇవ్వడాన్ని ఆమె తప్పుబట్టారు. "చంద్రబాబుకు మద్దతుగా సంఘీభావ యాత్ర చేపడితే తప్పేముంది. నాకు మనోధైర్యం కోసం పార్టీ శ్రేణులు యాత్ర చేపడితే తప్పేముంది. పార్టీ కార్యకర్తలు మా బిడ్డల్లాంటి వాళు ,,.. బాధలో ఉన్న అమ్మను కలిస్తే చర్యలు తీసుకుంటామని నోటీసులు ఇస్తారా?నన్ను కలవకూడదని చెప్పడానికి ఈ ప్రభుత్వానికి హక్కు ఎక్కడిది" అని ప్రశ్నిస్తూ భువనేశ్వరి ట్వీట్ చేశారు.

## కోడికత్తి కేసు.. 8 వారాలపాటు విచారణ నిలుపుదల చేస్తూ హైకోర్టు స్టే

అమరావతి : విశాఖ ఎన్‌ఐఏ కోర్టులో జరుగుతున్న కోడి కత్తి కేసు విచారణపై ఏపీ హైకోర్టు స్టే విధించింది. 8 వారాలపాటు విచారణ నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు కోడికత్తి కేసులో సీఎం జగన్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా పడింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఈ కేసులో లోతైన దర్యాప్తు కోరుతూ గతంలో జగన్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే.

## భువనేశ్వరిని అంతమాట అంటారా?...బుర్ర, బుద్ధి ఉండే మాట్లాడుతున్నారా?



విశాఖపట్నం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిపై ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి అనుచిత వ్యాఖ్యాలపై తెలుగు మహిళ అధ్యక్షురాలు అనిత తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం ఉదయం పార్టీ కార్యాలయంలో ముందు నారాయణ స్వామి ఫోటోలను తెలుగు మహిళలు దగ్ధం చేశారరు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. సజ్జల కాళ్ళ దగ్గర ఉండే దళిత మంత్రి.. అమ్మలాంటి భువనేశ్వరిపై మాట్లాడుతున్నారని మండిపడ్డారు. "భువనేశ్వరి ఫుడ్‌లో విషం పెతుతుందని అంటారా?.. బుర్ర, బుద్ధి ఉండే మాట్లాడుతున్నారా?.. చంద్రబాబు ఆరోగ్యంపై ఊర కుక్కలు మాట్లాడుతున్నాయి. భువనేశ్వరి గురించి.. మీకు ఏమి తెలుసు అని అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు?. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఎంతో మందికి భువనేశ్వరి ఎన్నో సేవలు అందిస్తున్నారు.. ఈ విషయం మీకు తెలుసా?. ఎపుడూ ఆమె రాజకీయాలలోకి రాలేదు.. తన భర్తను అక్రమంగా అరెస్టు చేశారు కాబట్టి బయటకు వచ్చారు" అని అనిత పేర్కొన్నారు.

## చంద్రబాబుకు రోజుకు రెండుసార్లు లీగల్ ములాఖత్ ఇవ్వాలి: డీఐజీని కోరిన తెదేపా నేతలు

అమరావతి: జైళ్ల శాఖ డీఐజీకి తెదేపా నేతలు వినతిపత్రం అందజేశారు. రాజమహేంద్రవరం జైలులో ఉన్న చంద్రబాబుకు లీగల్ ములాఖత్‌లు తగ్గించడంపై డీఐజీ రవికిరణ్‌తో తెదేపా నేతలు చర్చించారు. చంద్రబాబుపై మూడు న్యాయస్థానాల్లో వివిధ కేసులు కొనసాగుతున్నాయనీ.. ఆయన న్యాయవాదులతో మాట్లాడాల్సి ఉందని వివరించారు. ఇలాంటి సమయంలో లీగల్ ములాఖత్‌లు ఎలా తగ్గిస్తారని ప్రశ్నించారు.

రోజుకు రెండుసార్లు లీగల్ ములాఖత్‌లు ఇవ్వాలని కోరారు. తెదేపా నేతలు లేవనెత్తిన అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని డీఐజీ తెలిపారు.

## తాడేపల్లి ప్యాలెస్‌లో సిద్ధం చేసిన పిటిషన్‌ను మీరు చదివారా ఉండవల్లి?: పట్టాభి



రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించిన ఉండవల్లి అరుణ్‌కుమార్.. తాను దాఖలు చేసిన పిటిషన్‌లో ఏముందో చదివారా? అని తెదేపా అధికార ప్రతినిధి పట్టాభిరామ్ ప్రశ్నించారు. తాడేపల్లి నుంచి కొన్ని కాగితాలు వస్తే పిటిషన్‌కు ఏ డాక్యుమెంట్లు జత చేశారో కూడా చూడకుండా సంతకం పెట్టేస్తారా అని నిలదీశారు. నిజాలన్నీ పిటిషన్‌లోనే ఉన్నా.. తమపై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పట్టాభి మాట్లాడారు. "తాడేపల్లి ప్యాలెస్‌లో సిద్ధం చేసిన పిటిషన్ ఇది. అక్కడి నుంచి కొన్ని కాగితాలు వస్తే దానిపై ఉండవల్లి సంతకాలు చేసేశారు. ఈ పిటిషన్ ఆధారంగా కొన్ని ప్రశ్నలు వేస్తున్నాను. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు అసలు లేనే లేవంటారు. కనీసం చదవకుండా పిటిషన్లు వేసేస్తారా? థర్డ్ పార్టీ ఆడిట్ చేసి అన్ని పరిశీలిస్తే చాలా పరికరాలు మిస్ అయినట్లు కనుగొన్నారట? ఫోరెన్సిక్ నివేదికలో ఏముందో కూడా కనీసం చదవాలి కదా? నిజంగా చదివి ఉంటే వస్తువులు పోయాయని చెప్పేవారు కాదు. శరత్ అసోసియేట్ వాళ్లు స్పష్టంగా మేము ఫిజికల్ వెరిఫికేషన్ చేయలేదని చెప్పారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లకు వెళ్లి పరిశీలించలేదని నివేదికలో రాసి ఉంది. ఇవేమీ చదవకుండా హైకోర్టులో పిటిషన్ వేస్తారా" అని ఉండవల్లిని పట్టాభి ప్రశ్నించారు.




**విజయవాడ: బెజవాడ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. రేపటి నుంచి 50 రోజుల పాటు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ విధిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ కాంతి రాణా తెలిపారు. అక్టోబరు 18 నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు మొత్తం 50 రోజుల పాటు ఈ సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. నలుగురు లేదా అంతకు మించి జనం గుమికూడరాదని, కర్రలు, రాళ్లు పట్టుకుని తిరగరాదని హెచ్చరించారు. ఈ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా టాటా వార్నింగ్ ఇచ్చారు.**

గరుడ వార్త



# సరోవరంలో హంస రాణి

తెల్ల చీర.. తెల్ల బ్లౌజులో తళుకుబెళుకులు ప్రదర్శించింది ఫాతిమా సనా షేక్. తెల్లగా మెరిసిపోతున్న మంచి ముత్యాలు.. తెలుగు రంగు క్రిస్టల్స్ అల్లిక..లతో సనా కోసం డిజైన్ చేసిన ఈ ప్రత్యేకమైన డిజైనర్ శారీ యువతరంలో హాట్ టాపిక్ గా మారింది. ఈ అందమైన క్రిస్టలైన్ చీరలో సనా షేక్ అందం హంసరాణిని తలపిస్తోందంటూ పొగిడేస్తున్నారు. హంసల దీవి నుంచి దారి తప్పిపోయి వచ్చిందా? సరోవరం నుంచి అదుపు తప్పి వచ్చిందా? అంటూ కుర్రాళ్లు సరదాగా కామెంట్ చేస్తున్నారు. ఫాతిమా సనా షేక్ నటించిన 'ధక్ ధక్' ఇటీవల



విడుదలై మిశ్రమ సమీక్షలను అందుకుంది. అయితే ఈ స్పందనలకు వెరవక తన సినిమాని చురుగ్గా ప్రమోట్ చేస్తోంది. అయితే ఈ ప్రమోషన్స్ లో సనా షేక్ ప్రత్యక్షమవుతున్న తీరుకు అభిమానులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. అంత అందంగా సనా షేక్ డ్రెస్సప్ అయి వేదికలను అలంకరిస్తోంది. ఇటీవలి ప్రచార కార్యక్రమంలో, ఫాతిమా తన సహజసిద్ధమైన అందం, శైలిని ప్రతిబింబించే అద్భుతమైన ఫోటోషూట్ తో మంత్రముగ్ధులను చేసింది. సీక్విన్డ్ బ్లౌజ్ తెల్లటి చీరలో తన రూపం మంత్రముగ్ధం చేస్తోంది. సనా ధేధీప్యమైన మనోహరమైన రూపం యూత్ హృదయాల్ని లాక్ చేస్తోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ధక్ ధక్ తర్వాతా సనా షేక్ నటించిన సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. విక్కీ కౌశల్‌తో కలిసి 'సామ్ బహదూర్'లోను సనా షేక్ నటించిన సంగతి తెలిసిందే. ఇది బయోగ్రాఫికల్ డ్రామా. నిజ జీవిత కథ ఆధారంగా తెరకెక్కింది. ఇందులో సనా తన నటనకు పేరొస్తుందని భావిస్తోంది. ఇప్పటికే సోషల్ మీడియాల్లో సామ్ బహదూర్ కి ప్రచారం సాగిస్తోంది.

**అమీర్ ఖాన్‌తో స్నేహం:** అమీర్ ఖాన్ తన రెండో భార్య కిరణ్ రావు నుండి విడిపోక ముందే 'దంగల్' ఫేం ఫాతిమా సనా షేక్ తో ప్రేమలో పడ్డారని ప్రచారం సాగింది. ఫాతిమా వల్లనే ఆ ఇద్దరూ విడిపోయారని చాలా కథనాలు వెలువడ్డాయి. మీడియా నివేదికల ప్రకారం.. ఫాతిమా అమీర్ సన్నిహిత కుటుంబ పార్టీలకు హాజరవుతుంది.

ఆమె అమీర్ కోసం సెట్స్ కి కూడా వస్తుంది. కిరణ్ రావుతో విడాకులు సహా ఈ కొత్త ఎఫైర్ విషయంలో అభిమానులు అంత సంతృప్తిగా లేరన్నది తెలిసిందే.

# బ్లాక్ ఫ్రాక్ లో ఈషారెబ్బ కిర్రాక్

లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టి తరువాత అంతకుముందు ఆ తరువాత సినిమా ద్వారా హీరోయిన్ గా మొదటి సక్సెస్ అందుకున్న అందాల భామ ఈషారెబ్బ. నటిగా ఈ బ్యూటీ తాను చేసిన ప్రతి సినిమాతో మంచి మార్కులే వేసుకుంది. గ్లామర్ పరంగా కూడా చాలా మంది హీరోయిన్స్ కంటే బెస్ట్ గా ఉంటుంది. అయిన కాని ఈ అమ్మడుకి అదృష్టం కలిసి రావడం లేదని చెప్పాలి. కెరియర్ లో ఎక్కువగా చిన్న సినిమాలలోనే నటిస్తూ వస్తోన్న ఈషారెబ్బకి చెప్పుకోదగ్గ బ్లాక్ బస్టర్ హిట్స్ అయితే ఏమీ లేవు. మొదటి సినిమా తర్వాత అమీతుమీ సినిమాతో మరో హిట్ అందుకుంది. అలాగే బ్రాండ్ బాబు కూడా పరవాలేదనిపించుకుంది. రీసెంట్ గా



సుధీర్ బాబు మామా మశ్చీంద్ర మూవీతో ఈ అమ్మడు హీరోయిన్ గా ప్రేక్షకుల ముందుకి వచ్చింది. ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. డిజిటల్ లో కూడా అడుగుపెట్టిన ఈషారెబ్బ మాయాబజార్ ఫర్ సేల్, జేడీ చక్రవర్తి దయా వెబ్ సిరీస్ లతో సక్సెస్ అందుకుంది. ఓ వైపు సినిమాలు, మరో వైపు వెబ్ సిరీస్ లు చేస్తూ కెరియర్ ని స్ట్రాంగ్ గా బిల్డ్ చేసుకునే పనిలో ఈషారెబ్బ ఉంది. ఇదిలా ఉంటే ఈ బ్యూటీ నటిగా ఎంత గుర్తింపు వచ్చిందో అంతకు మించి పాపులారిటీ సోషల్ మీడియా ద్వారా తెచ్చుకుంటుంది. రెగ్యులర్ గా తన ఇన్ స్టాగ్రామ్ లో గ్లామర్ ఫోటోషూట్ లని షేర్ చేస్తూ ఫ్యాన్స్ కి కావాల్సినంత వినోదం ఈషా రెబ్బ అందిస్తూ ఉంటుంది. హాట్ హాట్ భంగిమలతో ఫోటోలకి ఫోజులు ఇస్తూ కుర్రకారు హృదయాల్ని కొల్లగొడుతూ ఉంటుంది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతాయి. తాజాగా ఈషా రెబ్బ వెకేషన్ లో లైఫ్ ఎంజాయ్ చేస్తోంది. ఈ సందర్భంగా ఈ అమ్మడు బ్లాక్ కలర్ లాంగ్ ఫ్రాక్ లో అందాలు చూపిస్తూ కుర్రాళ్ళకి హీట్ పెంచేస్తోంది. కరెక్ట్ గా వినియోగించుకుంటే ఈషారెబ్బ అందాలకి ఈపాటికే స్టార్ హీరోయిన్ అయిపోయేదనే మాట ఈమె ఫోటోలు చూస్తున్న నెటిజన్లు నుంచి వినిపిస్తోంది. ఈ పిక్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.




# బాలయ్య చేతిలో శ్రీలీల ఫ్యూచర్..?




పెళ్లిసందడి తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన శ్రీ లీల ధమాకాతో సూపర్ హిట్ అందుకుంది. ఆ తర్వాత దాదాపు ఏడు ఎనిమిది సినిమాల దాకా అవకాశాలు అందుకుంది. అయితే రీసెంట్ గా రామ్ తో స్కంద సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన శ్రీ లీల ఆ సినిమాతో ఫస్ట్ షాక్ చూసింది. స్కంద లో శ్రీలీల ఎందుకు చేసింది అన్న డౌట్ వచ్చేలా చేసుకుంది. అయితే మరో నాలుగు రోజుల్లో శ్రీలీల మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తుంది.

బాలకృష్ణ హీరోగా వస్తున్న భగవంత్ కేసరి సినిమాలో అమ్మడు నటించింది. సినిమాలో విజ్జి పాప పాత్రలో శ్రీ లీల నటించింది. సినిమా కథ మొత్తం ఆమె చుట్టే తిరుగుతుంది. ధమాకా హిట్ అయినా స్కంద ఫ్లాప్ అవడంతో శ్రీ లీల భవిష్యత్ అంతా కూడా భగవంత్ కేసరి మీద ఆధారపడి ఉంది. ఈ సినిమాతో శ్రీ లీల హిట్ కొడితే మళ్లీ ఆమె హిట్ సెంటిమెంట్ కొనసాగించే అవకాశం ఉంటుంది. ఒకవేళ భగవంత్ కేసరి అటు ఇటైతే మాత్రం ఆ ఎఫెక్ట్ కచ్చితంగా శ్రీ లీల రానున్న సినిమాల మీద ఉంటుందని చెప్పొచ్చు. సినిమాల సెలక్షన్ విషయంలో తన మార్క్ చూపించాలని చూస్తున్నా సరే డ్యాన్సులతో ఆడియన్స్ ను మెస్మరైజ్ చేస్తుంది. భగవంత్ కేసరి హిట్ పడితే శ్రీ లీల మళ్లీ తిరిగి ఫాంలోకి వచ్చినట్టే అని చెప్పొచ్చు. భగవంత్ కేసరి తర్వాత వైష్ణవ్ తేజ్ తో ఆదికేశ్వా, మహేష్ తో గుంటూరు కారం, నితిన్ తో ఎక్స్ ట్రా ఆర్డినరీ మ్యాన్ సినిమాలు చేస్తుంది శ్రీ లీల. ఈ సినిమాలతో పాటుగా పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ లో కూడా శ్రీ లీల నటిస్తుంది.

ఈ సినిమాలన్నీ కూడా శ్రీ లీల క్రేజ్ ను పెంచే అవకాశం ఉంటుంది. కన్నడలో కెరీర్ మొదలు పెట్టినా తన ఫ్యూచర్ మొత్తం టాలీవుడ్ లోనే ప్లాన్ చేసిన శ్రీ లీల కథల విషయంలో ఆచి తూచి అడుగులేస్తే మాత్రం తనని ఆపడం ఎవరి వల్లా కాదు. ఇప్పటికే రెమ్యునరేషన్ విషయంలో శ్రీ లీల భారీగా వసూళ్లు చేస్తుండగా ఈ సినిమాలు హిట్ అయితే ఆమె డిమాండ్ మరింత పెరిగే ఛాన్స్ ఉంది.

# శ్రీను వైట్ల సినిమా కంటే ఆ హడావిడి మరీ ఎక్కువైనట్టుందే!










శ్రీను వైట్ల తనదైన మార్కు కామెడీతో చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాల్ని సాధించాయి. ఒక దశలో తిరుగులేని స్టార్ డైరెక్టర్‌గా ఆయనని నిలబెట్టాయి. 'నీ కోసం' వంటి సినిమాతో మొదలైన ఆయన ప్రయాణం 'దూకుడు' వంటి బ్లాక్ బస్టర్ మూవీ వరకు విజయవంతంగా సాగిన వైట్ల ప్రయాణానికి ఆగడు డిజాస్టర్‌తో బిగ్ బ్రేక్ పడింది. ఆ తరువాత చేసిన బ్రూస్‌లీ, మిస్టర్, అమర్ అక్బర్ ఆంటోనీ వంటి సినిమాలు వరుస ఫ్లాపులుగా నిలిచి శ్రీను వైట్ల కెరీర్‌ని ప్రశ్నార్థకంలో పడేశాయి. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన శ్రీను వైట్ల అప్పటి నుంచి సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. దాదాపు ఐదేళ్ల విరామం తరువాత మ్యాచో మ్యాన్ గోపీచంద్ హీరోగా కొత్త సినిమాకు శ్రీకారం చుట్టారు. వేణు దోనేపూడి చిత్రాల స్టూడియోస్ బ్యానర్‌పై ఈ మూవీని నిర్మిస్తున్నారు. హీరో గోపీచంద్ 32వ ప్రాజెక్ట్‌గా మొదలైన ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం మిలాన్‌లో జరుగుతోంది. దూకుడు సినిమాని ఇక్కడే శ్రీను వైట్ల పూర్తి చేశాడు. అదే సెంటిమెంట్‌తో గోపీచంద్ సినిమాని కూడా మిలాన్‌లో చేస్తున్నాడు. సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. శ్రీను వైట్లతో పాటు ఈ సినిమా హీరో గోపీచంద్ కెరీర్‌కు అత్యంత కీలకంగా మారింది. చాలా రోజుల తరువాత గోపీ మోహన్ ఈ సినిమాకు పని చేస్తున్నారు. ఏ సినిమా షూటింగ్‌కు ఇంత హడావిడి చేయని శ్రీను వైట్ల ఈ మూవీ విషయంలో మాత్రం చాలా హడావిడి చేస్తూ కనిపిస్తున్నారు. ప్రతి షెడ్యూల్‌కు ఆన్ లొకేష్ వీడియోకు సంబంధించిన ప్రోమోని రిలీజ్ చేస్తూ నానా హంగామా సృష్టిస్తున్నారు. ఇదికాస్త ఓవర్‌గా అనిపిస్తోందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. గోపీచంద్ పాల్గొనగా కీలక ఘట్టాలని మిలాన్ సిటీలో చిత్రీకరించామని, ఫైనల్‌గా షూటింగ్ పూర్తయిందని తెలియజేస్తూ టీమ్ శుక్రవారం ఓ వీడియోని విడుదల చేసింది. గోపీచంద్ పాల్గొనగా కీలక ఘట్టాలతో పాటు ఓ పాటని, పలు యాక్షన్ ఘట్టాలని చిత్రీకరించినట్టుగా తెలుస్తోంది. ఇప్పటికే ఇలాంటి వీడియోలని టీమ్ వదలడంతో సినిమా షూటింగ్‌ని మించి ఇలాంటి వీడియోల హడావిడే మరీ ఎక్కువైందనే సెటైర్లు వినిపిస్తున్నాయి.

# బంగారు బొమ్మలా మిల్కీ బ్యూటీ

మిల్కీ బ్యూటీ తమన్నా అందం, యాక్టింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 18ఏళ్ల తన కెరీర్‌లో 50కి పైగా చిత్రాల్లో నటించి ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. ఇప్పటికీ తెలుగుతో పాటు తమిళ, హిందీ, కన్నడ సినిమాల్లోనూ నటిస్తూ కెరీర్‌ను సక్సెస్ ట్రాక్‌లో తీసుకెళ్తోంది. తాజాగా ఈ భామ.. గోల్డెన్ కలర్ డ్రెస్‌లో కళ్లు చెదిరే రేంజ్‌లో ఓపెన్ హార్ట్ షో పోజులిచ్చింది. ప్రస్తుతం నెట్టింట అవి వైరల్‌గా మారాయి. వివరాల్లోకి వెళితే.. తమన్నా ప్రస్తుతం వరుస సినిమాలు సిరీస్‌లతో దూసుకెళ్తోంది. రీసెంట్‌గా లస్ట్ స్టోరీస్ 2, జీ కర్దా వెబ్ సిరీస్‌తో ఆడియెన్స్‌ను అలరించింది. ఇందులో బోల్డ్ షోతో రెచ్చిపోయింది. అలాగే చిరంజీవి 'భోళా శంకర్', తమిళంలో రజనీకాంత్ 'జైలర్'తో పలకరించింది. వీటిలో జైలర్ ఒకటే బ్లాక్ బాస్టర్ హిట్‌గా నిలిచింది. ఇకపోతే దిగ్గజ నటి స్వర్గీయ జమున



బయోపిక్?లోనూ తమన్నా టైటిల్ రోల్ చేయబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. తమన్నా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఆ మధ్య వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ఆమె మలయాళంలో బంద్రా, తమిళంలో అరణ్?మణాయ్, హిందీలో వేద చిత్రాల్లో నటిస్తున్నాయి. ప్రస్తుతం ఇవి షూటింగ్ జరుపుకుంటున్నాయి. సోషల్ మీడియాలోనూ ఈ ముద్దుగుమ్మ ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ అదిరిపోయే ఫొటోషూట్స్‌ను పోస్ట్ చేస్తుంటుంది. తాజాగా లైట్ గోల్డర్ కలర్ లెహంగాలో దర్శనమిచ్చింది. జట్టుకు రంగేసి, మత్తెక్కించే చూపులతో భిన్న పోజులు ఇచ్చింది. ఆరు ఫొటోలను పోస్ట్ చేసింది. అన్నీ పిక్స్‌లోనూ ఎంతో అందంగా కనువిందు చేసింది. ప్రస్తుతం అవి నెట్టింట బాగా చక్కర్లు కొడుతున్నాయి. అవి చూసిన నెటిజన్లు స్టన్నింగ్, హాట్, గార్జియస్, హాట్ బేబీ, బ్యూటిఫుల్ అంటూ హార్ట్ అండ్ హాట్ ఎమోజీలతో కామెంట్ సెక్షన్ బాక్స్‌ను నింపేస్తున్నారు. తమన్నా వ్యక్తిగత జీవిత విషయానికొస్తే.. ఆమె కొంతకాలంగా నటుడు, తెలంగాణాకు చెందిన విజయ్‌తో రిలేషన్‌షిప్‌లో ఉంటోంది. ఇద్దరు కలిసే తెగ తిరుగుతున్నారు. కెమెరా కంటికి చిక్కుతున్నారు. చాలా సార్లు విజయ్? అంటే ఎంతో ఇష్టమని కూడా తమన్నా పేర్కొంది.

# మోక్షజ్ఞ అరంగేట్రం కోసమే అలా చేశాడా?

టాలీవుడ్‌లో వారసుల హవా కొనసాగుతోంది. ఆచలా మంది హీరోలకు సంబంధించిన వారసులు హీరోలుగా ఎంట్రీ ఇచ్చేసి స్టార్ డమ్‌ని సొంతం చేసుకోవడమే కాకుండా స్టార్‌లుగా ఓ వెలుగు వెలుగుతున్నారు. కానీ ఒక్క నందమూరి బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ మాత్రం ఇప్పటికీ ఎంట్రీ ఇవ్వకుండా ప్రతీ ఏడాది వాయిదా వేస్తూ వస్తున్నాడు. దీంతో బాలయ్య వారసుడి ఎంట్రీ ఎప్పుడు అనే చర్చ సర్వత్రా వినిపిస్తోంది. ఎంతగా చర్చ జరుగుతున్నా వారసుడి ఎంట్రీకి సంబంధించిన అప్ డేట్ ని మాత్రం బాలయ్య ఇప్పటికీ ఇవ్వలేకపోతున్నాడు. రెండు మూడేళ్ల క్రితం 'ఆదిత్య 999'తో మోక్షజ్ఞ హీరోగా పరిచయం అవుతాడని ప్రచారం జరిగింది కానీ కుదరలేదు. బాలయ్య డైరెక్టర్‌గా ఈ సినిమాతో వారసుడిని పరిచయం చేస్తాడని వార్తలు వినిపించాయి కానీ అదీ జరగలేదు. వచ్చే ఏడాదైనా అరంగేట్రం ఉంటుందా? అని సర్వత్రా చర్చ జరుగుతున్న వేళ నందమూరి మోక్షజ్ఞ యాక్టీవ్ అయ్యాడు. బాలయ్య నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'భగవంత్ కేసరి'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది సంయుక్తంగా నిర్మించారు.



శ్రీలీల కీలక పాత్రలో నటిస్తున్న ఈమూవీలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించింది. ఇప్పటికే ప్రచార చిత్రాలతో అంచనాల్ని పెంచేసిన 'భగవంత్ కేసరి' అక్టోబర్ 19న దసరా సందర్భంగా భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సినిమా రిలీజ్ సందర్భంగా ప్రమోషన్స్‌లో పాల్గొంటున్న హరీష్ గారపాటి ఓ మీడియాకు ప్రత్యేకంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో నందమూరి మోక్షజ్ఞపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమాలో మోక్షజ్ఞతో పాటు బాలయ్య తన చిన్న కుమార్తె తేజస్విని ప్రమోయంపై స్పందించారు. బాలకృష్ణగారిని ఈ చిత్రంలో విభిన్నకోణాల్లో చూపించామన్నారు. అంతే కాకుండా సినిమాలో కొత్త తరహా యాక్షన్ సన్నివేశాలుంటాయన్నారు. సాధ్యమైనప్పుడల్లా సెట్‌లోకి బాలకృష్ణగారితో పాటు మోక్షజ్ఞ సెట్లోకి వచ్చారన్నారు. వచ్చే ఏడాది మోక్షజ్ఞని హీరోగా పరిచయం చేయబోతున్నారు. ఆ కారణంగానే ఆయన సినిమా నిర్మాణంని అర్థం చేసుకోవడం కోసమే సెట్ లోకి అడుగు పెట్టారని స్పష్టం చేశారు. సాహు గారపాటి చెప్పిన దాన్ని బట్టి చూస్తుంటే మోక్షజ్ఞ వచ్చే ఏడాది సినిమాల్లోకి రంగ ప్రవేశం చేస్తున్నారన్నమాట. ముందుగా సినిమా నిర్మాణం, సెట్‌లో ఉండే వాతావరణాన్ని అవగాహన చేసుకోవడం కోసమే 'భగవంత్ కేసరి' సెట్‌కు క్రమం తప్పకుండా వచ్చారని తెలుస్తోంది. ఎంత ముందు జాగ్రత్త. ఎంతైనా బాలయ్య తనయుడు కదా.. ఆ మాత్రం జాగ్రత్త ఉంటుంది అని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి.



# నేడు తెలంగాణలో రాహుల్, ప్రియాంకగాంధీ పర్యటన

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ సమాయత్తం అవుతోంది. రేపటి నుంచి ఎన్నికల రణరంగంలోకి దిగబోతోంది. ప్రణాళికలో భాగంగా రేపటి నుంచి ఎన్నికల సమర శంఖం పూరించబోతోంది. ఏఐసీసీ అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ రేపు తెలంగాణ రాష్ట్రంలో పర్యటించనున్నారు. ములుగు జిల్లాలోని రామప్ప దేవాలయాన్ని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ రేపు సాయంత్రం 4 గంటల సమయంలో దర్శించుకుంటారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల మేనిఫెస్టోను శివుడి ముందు పెట్టి ప్రత్యేక పూజలు చేస్తారు. రాహుల్ గాంధీకి శివుడిపై విశ్వాసం ఉంది. శివుడిని దర్శించుకుని బస్సు యాత్ర మొదలు పెడుతున్నట్లు తెలుస్తోంది. మొదటిరోజు ములుగు, భూపాలపల్లి పరిధిలో మహిళలతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటారు. రెండో రోజు కరీంనగర్ జిల్లాలో, మూడో రోజు నిజామాబాద్ జిల్లాలో బస్సు యాత్రను రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ , కాంగ్రెస్ అగ్రనేతలు చేపడుతారు.

# విపక్షాలతో పెను ప్రమాదం.. రైతులు అప్రమత్తంగా ఉండాలి: కేసీఆర్



సిరిసిల్ల: విపక్ష పార్టీలతో పెద్ద ప్రమాదం పొంచి ఉందని, రైతులంతా అప్రమత్తంగా ఉండాలని సీఎం కేసీఆర్ సూచించారు. మంగళవారం సాయంత్రం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన భారాస ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. "నా 70 ఏళ్ల జీవితంలో సిరిసిల్లలో కనీసం వందసార్లు తిరిగా. ఒకప్పుడు సిరిసిల్ల ప్రాంతాన్ని చూస్తే కన్నీళ్లు వచ్చేవి. ఇప్పుడు అప్పర్ మానేరులో చూస్తే ఏడాదంతా నీరు ఉంటోంది. కరీంనగర్ ఎంపీగా పోటీ చేస్తే ఆదరించి.. గెలిపించారు. కానీ, అప్పట్లో ఏడుగురు చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకోవడంతో ఎంతో చలించిపోయా. పార్టీ నిధులు, చందాలు సేకరించి చేనేత కార్మికులకు సాయం చేశాం. కేటీఆర్ చేనేత శాఖ మంత్రి అయిన తర్వాత సిరిసిల్ల రూపు రేఖలు మారిపోయాయి. షోలాపూర్ ఎలా ఉంటుందో.. సిరిసిల్లను కూడా అలా చేయాలనేదే మా ప్రయత్నం. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు బతుకమ్మ చీరల పథకం అమలు చేస్తున్నాం. బతుకమ్మ చీరల పంపిణీ కేవలం చేనేత కార్మికులను ఆదుకునేందుకే. చివరికి ఆ పథకాన్ని కూడా రాజకీయం చేశారు. నచ్చకపోతే చీరలు తీసుకోవద్దు.. అంతే కానీ, చీరల పంపిణీని రాజకీయం చేయొద్దు" అని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. రేషన్‌కార్డు ఉన్న పేదలందరికీ నాణ్యమైన సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించినట్టు చెప్పారు. భవిష్యత్‌లో సిరిసిల్ల మంచి విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

**ధరణి ఉండాలో? వద్దో? మీరే తేల్చుకోవాలి..** "ధరణిని తీసి బంగాళాఖాతంలో వేస్తామని కాంగ్రెస్ పెద్దలు చెబుతున్నారు. ధరణి రద్దయితే మళ్లీ వీఆర్వోలు వచ్చి పెత్తనం చేస్తారు. రైతులంతా అధికారుల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరగాల్సిందే. ధరణి పోర్టల్ తీసేసి రైతులను ఇబ్బంది పెట్టాలని కాంగ్రెస్ చూస్తోంది.. రైతులంతా అప్రమత్తంగా ఉండాలి. ధరణి ఉండాలో?.. రద్దు కావాలో? రైతులే నిర్ణయించుకోవాలి. రైతు బంధు లేకుండా చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంది. విపక్షాలతో పెద్ద ప్రమాదం పొంచి ఉంది. వ్యవసాయానికి 3గంటల కరెంటు చాలని పీసీసీ అధ్యక్షుడు చెబుతున్నారు.. 3 గంటలు కావాలా? 24 గంటల కరెంటు కావాలా? 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ సరిపడా కరెంటు ఇవ్వలేదు" అని కేసీఆర్ విమర్శించారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత సిరిసిల్ల నేతన్నల జీవితాలు మారాయన్నారు. ప్రజా ఆశీర్వాద సభకు భారీగా తరలి వచ్చిన గులాబీ శ్రేణులతో సిరిసిల్ల జనసంద్రమైంది.

# డిసెంబరు 9న రాష్ట్రంలో కొలువుదీరేది కాంగ్రెస్ పార్టీయే: రేవంత్‌రెడ్డి




హైదరాబాద్ : డిసెంబర్ 9న రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 6గ్యారంటీలపై తొలి సంతకం చేయబోతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ బహిరంగసభకు ఆయన హాజరయ్యారు. ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించిన రేవంత్ రెడ్డి.. ఎమ్మెల్యేగా గడ్డం ప్రసాద్ కుమార్‌ను గెలిపించాలంటూ ప్రచారం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో కేసీఆర్ పూర్తిగా విఫలం చెందిందని ఆయన ఆరోపించారు. తెలంగాణ దశ.. దిశ మార్చే సమయం వచ్చిందని చెప్పారు.

**రేవంత్ రెడ్డిని కలిసిన దివ్యాంగ మహిళ** : నాంపల్లికి చెందిన వికలాంగురాలు (మరుగుజ్జు) రజినీ అనే యువతి మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీపీ చీఫ్ రేవంత్ రెడ్డిని కలిసింది. తాను పీజీ పూర్తి చేశానని, ఉద్యోగం రాలేదని, ప్రైవేట్ సంస్థల్లో కూడా ఉద్యోగం ఇవ్వడం లేదని తన ఆవేదనను వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. డిసెంబర్ 9వ తేదీన ఏల్బీ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ సీఎం అభ్యర్థి ప్రమాణ స్వీకారానికి రావాల్సిందిగా దివ్యాంగురాలిని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు కాగానే తన అర్హతలకు తగ్గ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీ స్కీములకార్డుపై రేవంత్ రెడ్డి స్వయంగా తన దస్తూరీతో దివ్యంగురాలి వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా ప్రవళిక విషయంలో ప్రెస్ మీట్ పెట్టిన డీసీపీపై కేసు పెడతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అమ్మాయి ఫోన్ సీజ్ చేస్తే సమాచారం ఎలా బయటకు వచ్చిందన్నారు. ఫోన్ ఓపెన్ చేయాలంటే కోర్టు అనుమతి తీసుకోవాలని, ఫోన్ సమాచారం.. ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్ట్ రాక ముందే డీసీపీ ప్రెస్ మీట్ ఎలా పెడతారని ప్రశ్నించారు. డీసీపీపై ఎలక్షన్ కమిషన్‌కు పిర్యాదు చేస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. అంతకుముందు గన్‌పార్క్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లకుండా టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. ఎలక్షన్ కోడ్ పేరుతో రేవంత్‌రెడ్డిని అడ్డుకోవడం కలకలం రేపింది. దీంతో పోలీసులతో రేవంత్ వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. రెండు రోజుల క్రితం సీఎం కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. డబ్బు, మద్యం పంచకుండా ఎన్నికలకు వెళ్దామా? అని కేసీఆర్‌కి రేవంత్ సవాల్ విసిరారు. తన సవాలుకు సిద్ధమైతే అమరవీల స్థూపం వద్ద ప్రమాణం చేద్దాం రమ్మని కేసీఆర్‌ని కోరారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నేతలతో కలిసి రేవంత్ అమరవీరుల స్థూపం వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు రేవంత్ సహా కాంగ్రెస్ నేతలను అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వాహనాలను కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలీసుల వ్యాన్ ఎక్కి మరీ రేవంత్ రెడ్డి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విడిచిపెట్టారు.

# బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్.. మరో ఎమ్మెల్యే గుడ్ బై




హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. మరో ఎమ్మెల్యే పార్టీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. రేవంత్ రెడ్డి నివాసానికి బోథ్ ఎమ్మెల్యే బాపురావు వెళ్లడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. బోథ్ సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన బాపురావును బీఆర్ఎస్ అధిష్టానం పక్కనబెట్టేసి ఆ స్థానాన్ని అనిల్ జాదవ్‌కి కేటాయించింది. దీంతో ఆయన బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను ఇటీవలే సీఎం కేసీఆర్ విడుదల చేసవారు. తెలంగాణ భవన్‌లో ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి అభ్యర్థుల వివరాలను చెప్పారు. అయితే ఏడు స్థానాల్లో మాత్రం మార్పులు చేశారు. ఈ సారి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుభాష్ రెడ్డి – ఉప్పల్, రాజయ్య – స్టేషన్ ఘనపూర్, రాములు నాయక్ – వైరా, రేఖా నాయక్ –ఖానాపూర్, చెన్నమనేని రమేష్ – వేములవాడ, గంప గోవర్దన్ –కామారెడ్డి, రాథోడ్ బాపురావు –బోథ్, విద్యాసాగర్ రావు – కోరుట్లకు టికెట్లు దక్కలేదు. వీరిలో ప్రస్తుతం రేఖా నాయక్ కూడా పార్టీ మారే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

**బీఆర్ఎస్‌కి గుడ్ బై చెప్పిన పలువురు కీలక నేతలు** : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి సమక్షంలో జీహెచ్ఎంసీ బీఆరెస్ ఫ్లోర్ లీడర్, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర నేతలు కాంగ్రెస్‌లో చేరారు. జూబ్లీహిల్స్ నివాసంలో కండువా కప్పి పార్టీలోకి రేవంత్ ఆహ్వానించారు. అనంతరం ఆయన అమర వీరుల స్థూపం వద్దకు బయలుదేరారు. రెండు రోజుల క్రితం కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. డబ్బు, మద్యం పంచకుండా ఎన్నికలకు వెళ్దామా అని కేసీఆర్‌కి రేవంత్ సవాల్ విసిరారు. తన సవాలుకు సిద్ధమైతే అమరవీల స్థూపం వద్ద ప్రమాణం చేద్దాం రమ్మని కేసీఆర్‌ని కోరారు. ఈ క్రమంలోనే ఆయన అమరవీరుల స్థూపం వద్దకు బయలుదేరారు. కాగా.. గన్ పార్క్ దగ్గర భారీగా పోలీసులు మోహరించారు.

# ఆసరా పింఛన్ పథకం బీఆర్ఎస్‌దా ?.. కాంగ్రెస్‌దా ?.. ప్రశ్నించిన మంత్రి పువ్వాడ అజయ్

ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ పరిపాలన ప్రజలకు కొత్తేమీ కాదని మంత్రి పువ్వాడ అజయ్ అన్నారు. ఆ పార్టీ సృష్టించిన అనేక సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరించిందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సాగునీటి ప్రాజెక్టులు కట్టుకున్నామని వెల్లడించారు. ఖమ్మంలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్రతో కలిసి మంత్రి పువ్వాడ అజయ్ మీడియాతో మాట్లాడారు. తాము అమలుచేస్తున్న అనేక పథకాలను కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పెట్టిందని విమర్శించారు. తాము ఇస్తున్న రైతుబంధును కాపీ కొట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆసరా పింఛను పథకం బీఆర్ఎస్‌దా లేదా కాంగ్రెస్ పార్టీదా అని ఆలోచించాలన్నారు. ఈసారి కూడా తమ పార్టీకి 88 నుంచి 90 స్థానాలు వస్తాయని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాను సీఎం కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. పదేండ్ల పాటు ఖమ్మం నగర ప్రజలతో మమేకమయ్యానని చెప్పారు. వర్తక, వాణిజ్య సంఘాల వారిపట్ల నిబద్ధతతో పనిచేశానని తెలిపారు. తాను ఖమ్మం భూమి పుత్రుడినని, ఇక్కడే పుట్టాను, ఇక్కడే చదువుకున్నా, నివాసం ఉంటున్నానని చెప్పారు. ఖమ్మం నగర అభివృద్ధి పట్ల తనకున్న ఆత్మత బయటివారికి ఉండదన్నారు. నగరానికి కష్టం వచ్చినప్పుడు ఇప్పుడు తిరిగే నాయకులు కనబడలేదన్నారు. సీఎం కేసీఆర్ ఖమ్మం నగరానికి ఏం కావాలన్నా చేస్తున్నారని వెల్లడించారు. ముఖ్యమంత్రి సహకారంతో నగరాన్ని మంత్రి పువ్వాడ ఎంతో అభివృద్ధి చేశారని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. నగరాభివృద్ధి కోసం అజయ్ కుమార్‌ను మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వేరే పార్టీలు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.




# క్షణాల్లో ఓటరు గుర్తింపు కార్డు పొందొచ్చు!

హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ–ఓటరు గుర్తింపు కార్డు(ఈ–ఎపిక్)ను డౌన్‌లోడ్ చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించింది. అందుకోసం వెబ్‌సైట్‌లో కీలక మార్పులు చేసింది. ఈ విధానంలో మొబైల్ నంబరు నమోదుతో క్షణాల్లో ఈ–ఓటరు గుర్తింపు కార్డును పొందొచ్చని, ఓటుహక్కును వినియోగించేందుకు అది చెల్లుబాటు అవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం రూపొందించిన ఫాం–8నే ఇందుకోసం ఉపయోగించాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తులో మొబైల్ నంబరు నమోదుకు ప్రత్యేక కాలమ్ అందుబాటులో ఉంది. దాన్ని క్లిక్ చేసి నమోదు చేసిన తరవాత దరఖాస్తును సబ్‌మిట్ చేయాలి. ఆ తరవాత https://voters.eci.gov.in లో e-epic విభాగంలోకి వెళ్లి నిర్ధారిత ప్రాంతంలో ఓటరు గుర్తింపు కార్డు సంఖ్యను నమోదు చేయాలి. వెంటనే ఏ మొబైల్ నంబరు నమోదుచేశామో, ఆ ఫోన్‌ను ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదుచేయగానే ఈ–ఓటరు గుర్తింపు కార్డు డౌన్‌లోడ్ అవుతుంది. 'ఆ పత్రం అన్ని ధ్రువపత్రాల మాదిరిగా చెల్లుబాటు అవుతుంది. ఎన్నికల సంఘం పంపే ఓటరు గుర్తింపు కార్డు కోసం ఎదురుచూడాల్సిన అవసరం ఉండదు. ఈ సదుపాయం గతంలోనూ ఉన్నప్పటికీ, అది ఆమోదం పొందేందుకు అధిక సమయం పట్టేది. నమోదిత వివరాలు సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆమోదించిన తరవాత ఆ ప్రక్రియ పూర్తయ్యేది. తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ ప్రక్రియను సరళతరం చేసింది' అని ఓ అధికారితో చెప్పారు.

# బీఎస్పీ మేనిఫెస్టో–2023 విడుదల



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు బీఎస్పీ పార్టీ సమాయత్తం అవుతోంది. ఎన్నికల ప్రచారానికి దూకుడు పెంచింది. ప్రణాళికలో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లిలో బీఎస్పీ సమావేశం నిర్వహించారు. బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా. ఆర్. ఎస్. ప్రవీణ్ కుమార్ బహుజన భరోసా పేరుతో పార్టీ మ్యానిఫెస్టో–2023 ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవళిక ఆత్మహత్య విషయంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు, ఆమె క్యారెక్టర్‌ను దెబ్బతీసే విధంగా మాట్లాడడం సిగ్గుచేటు. ఆమె పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోలేదని, ప్రిపేరే కాలేదని మాట్లాడడం మంత్రి కేటీఆర్ అవివేకం. సామాజిక మాధ్యమాల్లో ప్రవళిక పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న హాల్ టికెట్లు, దరఖాస్తులు కేటీఆర్‌కు కనిపించడం లేదా.. అబద్ధాలు ఆడే విషయంలో తండ్రిని మించిన తనయుడు కేటీఆర్. బాపు ఏక్ నెంబర్.. బేటా దస్ నెంబర్ చోర్. 1.45 లక్షల మంది నిరుద్యోగుల బతుకులతో కేసీఆర్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది.తెలంగాణ ప్రజలకు బీఎస్పీ 10 ప్రధాన హామీలు ఇస్తోంది.

**బీఎస్పీ ప్రధాన హామీలు ఇవే..** 1. కాన్షీ యువ సర్కార్: యువతకు ఐదేళ్లల్లో 10 లక్షల ఉద్యోగాలు (అందులో మహిళలకు 5 లక్షల కొలువులు) 2. పూలే విద్యా దీవెన: మండలానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్. ప్రతి మండలం నుంచి ఏటా 100 మంది విద్యార్థులకు విదేశీ విద్య. Data, AI, మరియు కోడింగ్‌లో శిక్షణ 3. బహుజన రైతు ధీమా: ప్రతి పంటకు కనీస మద్దతు ధరతో కొనుగోలు. రైతులకు విత్తు నుంచి విక్రయం వరకు కచ్చితమైన ప్రభుత్వ రాయితీ. ధరణి పోర్టల్ రద్దు 4. చాకలి ఐలమ్మ మహిళా జ్యోతి: మహిళా కార్మికులు మరియు రైతులకు ఉచిత వాషింగ్ మెషిన్, స్మార్ట్ ఫోన్, మరియు డ్రైవింగ్ శిక్షణ. అంగన్‌వాడీ, ఆశావర్కర్ల ఉద్యోగులు క్రమబద్దీకరణ. మహిళా సంఘాలకు ఏటా రూ. లక్ష 5. భీం రక్షా కేంద్రాలు: వృద్ధులకు హాస్టల్, ఆహారం మరియు ఉచిత వైద్య సేవలు. రక్షా కేంద్రాల్లో వికలాంగులకు మరియు ఒంటరి మహిళలకు తోడ్పాటు. 6. బ్లూ జాబ్ కార్డ్: పల్లె, పట్టణాల్లో 150 రోజుల ఉపాధి హామీ. రోజూ కూలీ రూ. 350కి పెంపు. కూలీలకు ఉచిత రవాణా, ఆరోగ్య మరియు జీవిత బీమా 7. నూరేళ్ల ఆరోగ్య ధీమా: ప్రతి కుటుంబానికి రూ. 15 లక్షల ఆరోగ్య బీమా ప్యాకేజీ. ఏటా రూ. 25,000 కోట్లతో పౌష్టికాహార, ఆహార బడ్జెట్ కేటాయింపు 8. వలస కార్మికుల సంక్షేమ నిధి: 5,000 కోట్ల నిధితో గల్ఫ్ కార్మికులకు సంక్షేమ బోర్డు వలస కార్మికులకు వసతి గిగ్ కార్మికులు, లారీ మరియు టాక్సీ డ్రైవర్లకు 600 సబ్సిడీ క్యాంటీన్లు. 9. షేక్ బందగీ గృహ భరోసా: ఇల్లు లేని వారికి 550 చ.గ. ఇంటి స్థలం ఇల్లు కట్టుకునే వారికి రూ. 6 లక్షల సహాయం ఇంటి పునర్నిర్మాణానికి రూ. లక్ష సహాయం 10. దొడ్డి కొమురయ్య భూమి హక్కు : భూమిలేని ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి, మహిళల పేరిట పట్టా.

# మంత్రి వేములను పరామర్శించిన కేటీఆర్..



వేల్పూర్: మాతృవియోగంతో బాధలో ఉన్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పరామర్శించారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లోని ఆయన నివాసానికి చేరుకున్న మంత్రి కేటీఆర్.. మంజులమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేముల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రశాంత్‌రెడ్డి మాతృమూర్తి వేముల మంజులమ్మ (77) ఈ నెల 12న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో కన్నుమూసిన విషయం తెలిసిందే.

# రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం అసాధ్యం : మంత్రి కొప్పుల



జగిత్యాల : బీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. తాజాగా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండలం రాంనూర్ గ్రామ ఉప సర్పంచ్ రేణుక, గ్రామ యూత్ అధ్యక్షుడు బిడారి తిరుపతితో పాటు మరో 50 మంది కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి సంకోజు తిరుమల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీని వీడి మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి వారికి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం అసాధ్యమన్నారు. అలవి కానీ హామీలతో ఆ పార్టీ ప్రజలను తప్పుదారి పట్టిస్తుందని విమర్శించారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా బీఆర్ఎస్ మూడోసారి విజయం సాధించడం ఖాయమన్నారు. పార్టీలో చేరిన వారిలో పొరండ్ల లచ్చయ్య, పొరండ్ల రామయ్య, పొరండ్ల కోటయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రవళిక వ్యక్తిత్వాన్ని ప్రభుత్వం దెబ్బతీసింది

హైదరాబాద్: ప్రవళిక ఆత్మహత్య చేసుకుని ఒకసారి చనిపోతే.. ప్రభుత్వం అసత్య ప్రచారాలు చేసి మరోసారి చంపేసిందని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం మండిపడ్డారు. ప్రవళిక సూసైడ్‌పై ప్రభుత్వం, కేటీఆర్, పోలీసుల అసత్య ప్రచారంపై నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సోమజిగూడ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రొఫెసర్ కోదండరాం, కాంగ్రెస్ అధికార ప్రతినిధి రియాజ్, AICC స్పోక్స్ పర్సన్ డాలీ శర్మ, నిరుద్యోగులు, విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడారు.

**కోదండరాం కామెంట్స్..** "ప్రభుత్వ ఉద్యోగం ధ్యేయంగా ప్రవళిక హైదరాబాద్‌కి వచ్చి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంది. ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన తర్వాతనే.. ఇంటికి వస్తా అని ఇంట్లో చెప్పింది. పేపర్ లీకేజ్, పరీక్ష రద్దు వల్ల నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అబద్ధాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రవళిక వ్యక్తిత్వాన్ని ప్రభుత్వం దెబ్బతీస్తోంది. ఉద్యోగాల విషయంలో కేటీఆర్ (%ఖు=%) చెప్పిన గణాంకాలన్నీ తప్పుడు లెక్కలే. రెండు లక్షలు ఉద్యోగాలు ఇచ్చామన్న కేటీఆర్ ప్రకటనపై చర్చకు సిద్ధమా?. జాబ్ క్యాలెండర్ ఇయర్ ప్రకటించడం లేదు. టీఎస్‌పీఎస్‌ను రద్దు చేసి కొత్త బోర్డు ఏర్పాటు చేయాలన్న స్పందన లేదు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య లేదన్నట్లుగా కేసీఆర్ మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పెన్షన్, రైతుబంధు, గ్యాస్ ధర తప్ప.. ఎక్కడా ఉద్యోగాల ఊసే లేదు. నిరుద్యోగులపై అడిగే ప్రశ్నలకు ఒక్క సమాధానం ఇస్తే.. ముక్కు నాలకు రాస్తా. ప్రెస్ క్లబ్‌లో ప్రెస్ మీట్ పెడుతాం అంటే.. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉందని పోలీసులు అంటున్నారు. ప్రవళిక పైన వాస్తవాలు చెప్పాలని ప్రెస్ మీట్ పెడితే.. పెద్ద ఎత్తున పోలీసులు వచ్చి ఇబ్బందులు గురిచేస్తున్నారు." అని కోదండరాం ధ్వజమెత్తారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com